అవధాన పుష్కరిణి

అంతర్జాల మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 1 ఆశ్వయుజ శుద్ధ విదియ, 23 సెప్టెంబరు 2025



ప్రచురణ

అవధాన విద్యా వికాస పరిషత్

భాగ్యనగరం

అవధాన విద్యా విజయతే తరామ్

అవధాన పుష్కరిణి

సంపుటి - 1 | అంతర్జాల మాస పత్రిక | సంచిక - 1

విశ్వావసు - అశ్వయుజం 2025

ప్రచురణ: అవధాన విద్యా వికాస పరిషత్

శ్రీయుతమై రసైకలహరీసితమై, వివిధావధాన వి
ద్యాయతధీకవీశ్వరులు తామరలై విరియన్ - త్వదీయ వి
జ్ఞేయ సుపద్యమాధురు లశేషబుధాళుల కిందు విందుగా
నీ యవధాన పుష్కరిణి - ఈప్సితమై వెలుగొందు నందమై

– డా. జి.యం.రామశర్మ, శతావధాని

కార్యాలయం
శ్రీరామ సదనం, 29-1499/6/1,
వెస్ట్ కాకతీయ నగర్, రోడ్ నం.1,
నేరేడుమెట్టు, సికిందరాబాద్ - 500 056
ఫోన్: 9441039146

అవధాన విద్యా వికాస పరిషత్ సేవాకార్యక్రమాలకు ఆర్థికంగా సహకరించదలచిన సహృదయులు ఫోన్ పే ద్వారా స్పందించగలరు.

సంపాదకీయం

అవధానవిద్యా విజయతే తరామ్



కుడుములు కూర్మిని గుడుచుచు
నడుమున వ్రేలాడు నల్ల నాగును గనుచున్
తడుముచు బొజ్జను దయ మా
కిడుములు తొలగించు నట్టి యిభముఖు గొలుతున్

అవధానం తెలుగువారి ఆత్మీయవిద్య. తెలుగు భాష ఆత్మగౌరవాన్ని పెంచే విద్య. తరతరాల వారసత్వ సంపదైన విద్య. మనముందుతరాలలో బంగారు పల్లకీలలో ఊరేగిన విద్య. మల్లినాథ, మాడభూషి, తిరుపతి వేంకటులు, కొప్రంపు కవులు మొదలైన మహోన్నతులెందరో కొలిచి తీర్చిదిద్దిన విద్య. వేదాలలోని అవధాన తత్పరతను, జ్ఞాన సంపదను సాహిత్యానికి అనువర్తింపజేసి ఛందస్సుందరంగా కాపాడుకుంటున్న విద్య.

కర్ణుని సహజ కవచకుండలాల లాగా తెలుగు పద్యం యతిప్రాసలతో జన్మించి వర్ధిల్లుతుంది. రాగ తాళ లయాత్మక విన్యాసాలకు అందంగా ఒదిగిపోయే అజంతభాష అయిన మనతెలుగే పద్యమై పరిమళిస్తుంది. అగ్గిపుల్ల నుండి అనంతవిశ్వందాటి విస్తరిల్లిన తెలుగుపద్యం స్పృశించని కోణంలేదు. చూడని లోతులులేవు. ధారాధారణా శోభితమైన అవధాన విద్య ధిషణా శక్తిని బహుముఖీనంగా ప్రకటిస్తుంది. ఆశువుగా అనర్గళంగా సాగే అవధానం సాధనవేళ విద్యగా, ప్రదర్శన వేళ కళగా రాణిస్తుంది.

అందుకే అవధానం ‘జగదాశ్చర్యకర సాహిత్య క్రీడ’ అయింది.

ఈ విద్య మన పెద్దలనుండి ఉపాయనంగా మనకు అందింది. మన భావితరాలకు పదిలంగా అందించే బాధ్యత మనదేకదా!

తెలుగు పదాలే పిల్లల పెదాలపై కనుమరుగైపోతున్నవేళ తెలుగు పద్యాన్ని, అందునా మహోన్నత ధిషణాధురీణమైన అవధానాన్ని భావితరాలకు అందించే దీక్షాధారులెందరో ఇప్పటికీ తెలుగునాట ఉన్నారు. వారందరి మార్గదర్శనంలో .. అవధాన విద్యా వికాస పరిషత్ తనవంతు కృషి తాను చేస్తూనే అవధాన పుష్కరిణి ద్వారా ఈ విద్యను చక్షురక్షర సంయోగంతో పదిలపరచే ప్రయత్నానికి శ్రీకారం చుట్టింది.

అవధాన విద్వర్యులు ఆశీర్వదింతురుగాక!

అవధాన విద్యాభిలాషులు అనుసరింతురుగాక!!

సంస్తుతి

ఓంకార మాద్యం ప్రవదన్తి సంతోవాచః
శృతీనామపి యంగృణఃతిః ॥
గజాననందేవగణానతాంఘ్రింభజే
హమర్ధేందుకృతావతంసమ్ ॥

(మహాత్ములు ఎవరిని ఆదినాదమైన ఓంకారంగా భావిస్తారో, వేద ఋక్కులు కూడా ఎవరిని స్తుతిస్తాయో, దేవతా సమూహాలు ఎవరి పాదాలకు శిరస్సులు వంచి నమస్కరిస్తాయో, నెలవంక ఎవరికి శిరోభూషణమో అట్టి గజాననుని సేవిస్తున్నాను.)

తను వసితాంబుదంబు, సితదంతయుగం బచిరాంశు లాత్మ గ
ర్జన మురుగర్జనంబుగ రసద్రుచి శక్రశరాసనంబునై
చన మదవారివృష్టి హితసస్య సమృద్ధిగ నభ్రవేళ నా
జను గణనాథు డిచ్చు ననిశంబు నభీష్టఫలంబు మాకిలన్

(కుమార సంభవము - నన్నెచోడుడు)

నల్లని శరీరం కారుమబ్బు, తెల్లని దంతాలు దానిలోని మెరుపులు. శరీరానికి అలంకారంగా అలదుకున్న గంధం, కుంకుమ, హరిద్రాది రసాలు, ఇంద్రచాపం, తన గర్జనలు, ఉరుములు, మదజలం కోరికలనే పంటలు పండే వర్షంగా వర్షాకాల మేఘంవలె కనిపిస్తున్న గణపతి ఎల్లప్పుడూ మాకు కోరిన కోరికలిచ్చుగాక!

ఆదరమొప్ప మ్రొక్కిడుదు నద్రిసుతా హృదయానురాగ సం
పాదికి, దోషభేదికి ప్రపన్నవినోదికి విఘ్నవల్లికా
చ్ఛేదికి మంజువాదికి నశేష జగజ్జననందవేదికిన్
మోదక ఖాదికిన్ సమద మూషికసాదికి సుప్రసాదికిన్!

(భాగవతము - పోతనామాత్యుడు)

పార్వతీ దేవికి సంతోషం కలిగించేవానికి, పాపాలను తొలగించే వానికి, ఆశ్రయించేవారిని ఆనందపరచేవానికి, ఆటంకాలను ఖండించేవానికి, మంజులవాక్కులు గలవానికి, సమస్తప్రజలను ఆనందింపజేసేవానికి, కుడుములను తినేవానికి, పొగరెక్కిన ఎలుక తేజిని ఎక్కేవానికి, శుభాలిచ్చేవానికి మిక్కిలి భక్తితో నమస్కరిస్తున్నాను.

దంతాఘట్టన రాజతాచల చలద్గౌరీ స్వయంగ్రాహమున్
గంతుద్వేషికి జేర్చ శైలజకు దద్గంగాఝురాశాంతి న
త్యంతామోదము మున్ను దానిడి కుమారాగ్రేసరుండై పిత్రృ
స్వాంతంబు ల్వెలయింపజాలు నిభరాద్వక్త్రున్ ప్రశంసించెదన్!

(వసుచరిత్రము - భట్టుమూర్తి)

గజాస్యుడు ఒకనాడు తన దంతాలతో కైలాసపర్వతాన్ని కదిలించగా పార్వతి భయపడి శివుని కౌగలించుకుంది. ఆ భయాన్ని పోగొట్టటానికి వినాయకుడు శివుని తలపైనున్న గంగను వెదజల్లినాడు. అది చూచి పార్వతి ఆనందించింది. తల్లిదండ్రులకు ఆనందం కలిగించిన వినాయకుని నేను పొగడుతున్నాను

అంకము జేరి శైలతనయా స్తనదుగ్ధములాను వేళ బా
ల్యాంకవిచేష్ట దొండమున నవ్వలి చన్ గబళింపబోయి యా
వంక గుచంబు గాన కహివల్లభ హారము గాంచి వే మృణా
ళాంకుర శంక నంటెడు గజాస్యుని గొల్తు నభీష్ట సిద్ధికై!

(మనుచరిత్ర - అల్లసాని పెద్దన)

పార్వతి ఒడిలో చేరి పాలు త్రాగుతూ తొండముతో ఆమె రెండవస్తనాన్ని గ్రోలబోయి ఆవైపు స్తనానికి బదులు పామును గాంచి అది తామరతూడని భ్రమించి పట్టుకొనే వినాయకుని నా కోరిక తీరటానికి ప్రార్థిస్తున్నాను.

తనదంతాగ్రముచేత తీక్ష్ణమతి యుద్యత్కుంభయుగ్మంబుచే
త నితాంతోన్నతదానవిస్ఫురత నుత్సాహంబు శుండాముఖం
బున దీర్ఘాయువు నిచ్చుగావుత గుణాంభోరాశికిన్ గృష్ణరా
యనికిన్ వారణ రాజవక్త్రుడు కృపాయత్తైక చిత్తాబ్జుడై

(పారిజాతాపహరణము - నంది తిమ్మన)

గజముఖంగల వినాయకుడు కృపగల హృదయం గలవాడై శ్రీకృష్ణదేవరాయలకు, పాఠకులకు తన కుంభయుగ్మంతో ఎల్లప్పుడు ఉన్నతిని దంతాగ్రంలో తీక్ష్ణమైన మతిని నిడుపైన తొండంతో దీర్ఘాయువును ఇచ్చుగాక!

ఇదీ క్రమణిక



శతావధాని కోలాచల పెద్ద మల్లినాథ సూరి

– శతావధాని డా॥ జి.యం. రామశర్మ

కవిత్వమొక యోగం, అవధానమొక ప్రయోగం. పద్య విశ్వరూప ప్రదర్శనమే అవధానం. అవధాన విద్య తెలుగు వారి ప్రతిభకు నిలువెత్తు నిదర్శనం. అది తెలుగువారి సొంతం. 'అవ' పూర్వకడు ధాఞ్ ధారణ పోషణయోః అనే ధాతువు నుండి నిష్పన్నమైన అవధాన శబ్దానికి చిత్త ఏకాగ్రత (ధారణ) అని అర్థం. 'చిత్తైకాగ్ర్యమవధానం' అని నిర్వచించిన ప్రముఖ అలంకారికుడు వామనాచార్యుడు తన కావ్యాలంకార సూత్ర వృత్తిలో అవధానమును కూడ కవిత్వ బీజముగా ఉల్లేఖించాడు. అవధానము లేనిదే అర్థ దర్శనం కాదు – అని ఆయన స్పష్టీకరించాడు. ఆయన అభిప్రాయం ప్రకారం అవధానం (చిత్త, ఏకాగ్రత) ఉంటేనే మనస్సు అభిలక్ష్య వస్తువును దర్శించ గలుగుతుంది.



వేద విద్యతో ప్రారంభమైన అవధాన విద్య క్రమంగా తెలుగు సంస్కృత సాహిత్యాలలో అనువృత్తమై అష్టశతాద్యవధానాలుగా రూపుదిద్దుకుంది.

"చదివిన వారు లక్షలు గల్గినను" – అందు
పండితుండొక్కండు బయలుదేరు
అట్టి పండితులలో నరయ నూటికి నొక్క
రుండు కవీశ్వరుడుండునేమొ
అట్టి కవీశులందరయ మాటికి నొక్క
రుండవధానియై యుండునేమొ"

అని అసమాన ప్రతిభారవులుగా వెలిగిన తిరుపతి వేంకట కవులు ప్రకటించిన ప్రకారం కవి అవధానిగా కావడం ఎంత అరుదైన అంశమో తెలుస్తున్నది. ఇట్టి అపురూపమైన అవధాన విద్యకు ఆద్యుడు, విద్వదారాధ్యుడు, సకలసాహితీవిశ్వ సంవేద్యుడు తెలంగాణ రాష్ట్రంలోని మెదకు జిల్లాలోని కొలిచెలను (ప్రస్తుతం కొల్చారం) గ్రామ వాసిగా వాసిగాంచిన ప్రప్రథమ శతావధాని శ్రీకోలాచల వంశమణి అయిన పెద్ద మల్లినాథ సూరి కావడం ఈ తెలుగు నేల చేసుకున్న పుణ్యవిశేషం. ఈ మహానుభావుడు కాళిదాసాది మహాకవుల మహాకావ్యాలకు వ్యాఖ్యాన సౌరభాలను సంతరించిన మహామహోపాధ్యాయ, వ్యాఖ్యాతృ చక్రవర్తి, పదవాక్య ప్రమాణ పారావార పారీణుడు – అయిన మల్లినాథసూరికి స్వయంగా పితామహుడు (తాతగారు).

విశేషమేమంటే – ఈ పెద్దమల్లినాథసూరి 13వ శతాబ్దికి చెందిన కాకతీయ వంశ్యుడైన ఓరుగల్లు (ప్రస్తుతం వరంగల్) రాజైన రెండవ ప్రతాపరుద్రుని అస్థాన కవిగా రాజితుడై ఆ రాజస్థానంలో శతావధానం చేసి ప్రతాపరుద్ర చక్రవర్తి చేత స్వప్రతిభాను రూపమైన కనకాభిషేకాన్ని పొంది రాజుపూజితుడైనట్లుగా ఈ క్రింది శ్లోకం ప్రమాణీకరిస్తున్నది.

"కొలచెల్మాన్వయాబ్ధీందు ర్మల్లినాథో మహాయశాః
శతావధాన విఖ్యాతో వీరరుద్రాభివర్ణితః"

సాహిత్య చరిత్రలో లభ్యమైన ఈ శ్లోకాన్ని బట్టి అవధాన ప్రక్రిమ 13వ శతాబ్దిలో ప్రభవించిందని, అష్టావధానం కంటే శతావధానమే మొదటగా ప్రదర్శితమైనదని. ఆ మొట్టమొదటి శతావధాని మహామనీషి శ్రీ కోలాచల పెద్దమల్లినాథసూరి అని విశదమవుతున్నది. అయితే ఆ శతావధానం తెలుగులో జరిగిందా? సంస్కృతంలో జరిగిందా? అనే ప్రశ్నకు ఆధారాలు లేవు. ఇంకా ఈ అవధానంలో ఏఏ అంశాలు ప్రవృత్తము లయ్యాయో? దాని స్వరూపస్వభావాలు తెలిపే చారిత్రికాధారాలు కూడ ఏవీ లేవు.

కోలాచల వంశం చాల ప్రసిద్ధ పండిత వంశం. వ్యాఖ్యాతృ చక్రవర్తి అయిన మల్లినాథసూరి పెద్దకొడుకైన పెద్దయార్యుడు, చిన్న కొడుకైన కుమారస్వామి సోమపీథి – ఇద్దరు కూడ తండ్రివలెనే పదవాక్య ప్రమాణ పారావార పారీణులే. విశేషించి కుమారస్వామి సోమపీథి సంస్కృతంలో ప్రామాణిక ఆలంకారిక గ్రంథమైన ప్రతాపరుద్రీయానికి 'రత్నాపణ' మనే పేరుతో అద్భుత వ్యాఖ్యానాన్ని విరచించిన విద్వన్మణి. ఆ కోలాచల కోవిద వంశానికి శతధా నమస్సుమాల నర్పిస్తూ 'అలమతి విస్తరేణ'.

'జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః'

అవధానకళా చరిత్ర 1

శతావధాని
ఆముదాల మురళి

అది మహాశివరాత్రి పర్వదినం. జాగరణ కాలం. పిల్లాజెల్లాతో సహా అందరూ మేల్కొని ఉన్నారు. ఒక చోట పురాణ కాలక్షేపం జరుగుచున్నది. మరో చోట భజన కార్యక్రమం జరుగుచున్నది. ఒక అరుగుమీద కొందరు పండితులు కొలువుదీరి శాస్త్రచర్చలు చేస్తున్నారు. అంతా శివమయం, ఎటుచూసినా భక్తి పారవశ్యం. తొలిజాము దాటింది. చలి తన ప్రతాపాన్ని చూపించడానికి విశ్వప్రయత్నం చేస్తూ ఉంది. చెట్లపై వాలిన పక్షులు కూడా నిదురమాని ఆ వేడుకలను చూస్తున్నాయి. సరిగ్గా అప్పుడు... పండితులున్న అరుగు దగ్గర చిన్న అలజడి.... 'ఇదిగో సాములూ, మీరు చెప్పేవన్నీ బాగున్నాయి గాని నేనో కైపద మంటాను, అందుకుంటారా?' అన్నాడు అప్పుడే అక్కడికి వచ్చిన వ్యక్తి. అందరూ నిటారయ్యారు... 'అను చూద్దాం' అన్నారు.

చట్రాతిని నారతీయ చయ్యన వచ్చున్' అన్నాడు ఆ వచ్చిన వ్యక్తి. 'బాగుంది... రాతిలో నార వస్తుందటయ్యా' – అన్నాడొక పండితుడు. 'తీయాలి మరి కై పదమంటే అంతేకదా! కాని దాన్ని ఔననిపించాలి!' – అన్నాడు కై పదమిచ్చిన వ్యక్తి. ఇంతలో అరుగు మీద పండితుల్లో ఒకరు ఇలా అందుకొన్నారు...

"ఇట్రార! యుక్తి చెప్పెద
పట్రా యిది తాటిమట్ట పదిలముతోడన్
కొట్రా నీ భుజశక్తిని
చట్రాతిని; నారతీయ చయ్యన వచ్చున్" అన్నగానే అందరూ 'భళే, భలే' అన్నారు. కైపదమిచ్చినవాడు నమస్కరించి వెళ్లి పోయాడు. పండిత మండలిలో ఒకవ్యక్తి భ్రుకుటి ముడిపడింది. 'ఈ ఇట్రా, పట్రా, కొట్రా పదాలు సాధువులా' అన్నాడు. పూరించి నాయన బిక్కముఖం వేశాడు. మరో పండితుడు 'ఇప్పుడు ఆ చర్చ ఎందుకండీ నీవీమోక్షణ వేళాయాం వస్త్రమూల్య చర్చ కాకపోతే' అన్నాడు. అందరూ 'శివశివా' అని చెవులు మూసుకొన్నారు.

ఆ చర్చ అక్కడికి ముగిసింది, అందరి హృదయాలు శివమయమయ్యాయి. ఇది అవధాన విద్యకు నాంది.

ఇలా వీధి అరుగుల మీద కైపదాలతో ప్రారంభమైన విలాస విద్య – వికాసవిద్యగా, వినోద విద్యగా రాజాస్థానాలకు తీగబారింది. అవధానంగా రూపుదిద్దుకున్నది. ఆశుకవిత్వనైపుణ్యము, సద్యః స్ఫూర్తి, కలగలసిన వ్యక్తిత్వవికాసం అవధానం. రాజులపోషణలో మహాకావ్యాలు నిర్మించిన మహాకవులు ఆ రాజ్యంలో జరిగే వసంతోత్సవాల వంటి ఉత్సవాలలో పాల్గొన్నప్పుడు, పరదేశ పండితులతో స్పర్ధ కలిగినప్పుడు ఆశుకవిత్వం చెప్పి అలరించడమే కాక రాజుల కోరిక మీద కూడా ఆశుకవిత్వం చెప్పి అగ్రహారాలు, మడిమాన్యాలు గ్రహించారు. వీధి అరుగు మీది కైపదం రాజాస్థానంలో సమస్యాపూరణంగా మారింది.

ఆశు కవిత్వం మూలకందంగా ఈ ప్రశ్నోత్తరిలో అనేక ప్రయోగాలు జరిగాయి, కవిత్వధారకే గాక ఏక సంథాగ్రహణాది ధారణా పరీక్షలకు కూడా స్థానం ఏర్పడింది. ధారా ధారణలు కలిసిన ఆశు ప్రదర్శనలో అక్షర నిషేధం, అక్షరన్యస్తం, అక్షరవ్యత్యస్తం, పదదత్తం, పాదపూరణం, ఘంటాగణనం, పురాణవ్యాఖ్యానం, సహపఠనం, వ్యాకరణ చర్చ... ఇలా అనేక అంశాలు చేరుతూ వచ్చాయి. వీటన్నిటికీ ఉండాల్సిన మొదటి దినుసు ఏకాగ్రత. దాన్నే అవధానం అన్నారు.

'దుధా' ధారణ పోషణయోః అన్న ధాతువునకు 'అవ' అన్న ఉపసర్గ చేరితే అవధానం అన్న పదం నిష్పన్నమావౌతుంది. 'వష్టి వాగురిరల్లోపమవాప్యోః పసర్గయోః' – అన్ని కారిక ననుసరించి ఉపసర్గలోని మొదటి అకారం లోపించి అవధానం – వధానం అవుతుంది. నన్నయభట్టు – 'దత్తావధానులై వినుడు' అని, తిక్కన – అవధానంబుతో నవధరింపుడు' అని ఏకాగ్రత అనే అర్థంలో అవధాన శబ్దాన్ని ప్రయోగించారు.

కవుల బిరుదావళిలో కూడా ఈ అవధాన శబ్దం ప్రయుక్తమై ఉన్నది. కాకతీయప్రభువు ప్రతాపరుద్రుని కాలంలో (క్రీ.శ.1295 –1323) కొలచెల్మ మల్లినాథుడు అనే శతావధాని ఉండేవాడు. ఈయన కోలాచల మల్లినాథసూరిగా ప్రసిద్ధుడై సంస్కృతకావ్యాలకు వ్యాఖ్యానాలు వ్రాసిన వారి తాతగారు. పెదమల్లినాథయ్య అన్న వ్యవహార నామంగల వీరు ప్రతాపరుద్రునిచే కనకాభిషేక గౌరవం పొందినట్లు క్రింది శ్లోకం ద్వారా తెలుస్తున్నది.

"కొలచెల్మాన్వయాబ్ధీందు ర్మల్లి నాథోమహాయశాః ।
శతావధాన విఖ్యాతో వీరరుద్రాభివర్షితః ॥"

చరిగొండ ధర్మన 'శతలేఖివ్యవధాన పద్యరచనా సంధాసురత్రాణ చిహ్నిత నాము'డట. విక్రమార్క చరిత్రను వ్రాసిన జక్కన తన తాతగారిని గూర్చి 'ఎవ్వడే యవధాన మెరుగు నయ్యవధానమున వాని కించుక ముల్లు సూప'గలడని పేర్కొన్నాడు. 'సకల భాషావిశేష నిరుపమానావధాన శారదామూర్తి'నని 15వ శతాబ్దికి చెందిన రామరాజ భూషణకవి వాకొన్నారు. 'ఘటికాశతగ్రంథ ఘటన ముఖ్య కవిత్వ నానావిధావధాన రూఢి' తన సొంతమని శ్రీ పట్టమట్ట సోమనాథ సోమయాజి తెలియజేశారు. వీరు 16వ శతాబ్దం వారు, అంతేకాక మరింగంటి సింగరాచార్యుల వారికి శతఘంటావధాన ప్రసిద్ధులని బిరుదముద్రిక కలదు. క్రీ.శ. 1085 ప్రాంతంవారైన నారాయణభట్టుకు 'అష్టాదశావధారణ చక్రవర్తి' అన్న బిరుదమున్నది. ప్రబంధరాజ →

యయాతి చరిత్ర

డా. ఆచార్య ఫణీంద్ర

సిరుల మెరుంగుబోడి తన చెక్కులు, సిబ్బెపు గబ్బి గుబ్బలున్
బరువిడి నాల్గు చేతులను బట్టగ, నల్వ దలంచి కేలు దా
మర గుడికన్ను మూయుటుకు, మాటికి నవ్వెడు వెన్ను డింపుతో
దిరముగ బ్రోచు గావుత మదిం జలరేగి 'యమీను ఖాను'నిన్!

తెలుగు సాహిత్యంలో వెలసిన తొట్ట తొలి "అచ్చ తెనుగు" కావ్యం – "యయాతి చరిత్ర". ఈ కబ్బాన్ని వెలార్చిన "తెలగన" నిజంగా సార్థక నామధేయుడు. అంతకు ముందు అక్కడక్కడా కొన్ని అచ్చ తెనుగు పద్యాలున్నా, పూర్తిగా అచ్చ తెనుగులో ఒక ప్రబంధాన్నే రచించిన ఈ పొనగంటి తెలగన – తెలుగు సారస్వతంలో ఆద్యుడు. పొనగంటి తెలగనార్యుడు 16 వ శతాబ్దికి చెందిన గోల్కొండ సామ్రాజ్యంలోని "పొట్ల చెరువు" అనే గ్రామ నివాసి. ఈ గ్రామమే ఈనాడు హైదరాబాద్ మహా నగర సమీపంలోని "పటాం చెరువు" అను కొందరు చరిత్ర కారులు నిర్ధారించారు. కవి ఈ కృతిని గోల్కొండ ప్రభువై, తెలుగు కవులచే "మల్కిభరాముడు" అని ప్రస్తుతించ బడిన "ఇబ్రహీం కులీ కుతుబ్ షాహి" కి సామంత రాజు (సరదార్)గా ఉన్న "అమీన్ ఖాన్"కు అంకితం చేసాడు. "యయాతి చరిత్ర"లోని ఈ మొట్టమొదటి పద్యాన్ని కృతికర్త లలిత శృంగార, చమత్కార భక్తి సమన్వితంగా నడిపించి, అట్లాగే – కృతి స్వీకర్తకు ఆశీఃపూర్వకంగా రూపు దిద్దాడు.



ఇక ఈ పద్యం లోనారసి చూద్దాం. "సంపదల కాంతులీనే స్త్రీమూర్తి, అనగా లక్ష్మీదేవి తన చెక్కిళ్ళను రెండు చేతులతో, శోభాయమానంగా, బిగువుగా ఉన్న తన వక్షోజాలను మరో రెండు చేతులతో, ఇట్లా విష్ణుమూర్తి నాల్గు చేతులతో దూకుడుగా వచ్చి పట్టుకోగా, ఆమె అది తన కుమారుడైన బ్రహ్మ చూడకూడదన్న ఆలోచనతో, తన తామర పూవు వంటి చేతితో ఆ విష్ణుమూర్తి కుడి కన్నును మూసిందట! తన శృంగార క్రియకు ప్రతిగా, లక్ష్మి చేస్తున్న ఆ చమత్కార చర్యను చూసి మాటి మాటికి నవ్వుతూ ఉండే ఆ వెన్నుడు .. అనగా విష్ణువు మది నిండా సంతోషిస్తూ సదా అమీన్ ఖాను ను రక్షించు గాక!" – అని ఈ పద్య భావం.

మరి .. బ్రహ్మ చూడకుండా ఉండాలంటే, విష్ణుమూర్తి కన్ను మూయడమేమిటి? అందునా .. కుడి కన్ను ఒక్కదానినే మూయడం ఏమిటి? ఇక్కడే తెలగన కవి భావనా గరిమ ప్రస్ఫుటం అవుతుంది. జగదాధారకుడైన శ్రీమహావిష్ణువుకు ఆ సూర్య చంద్రులే రెండు కళ్ళని మనందరికీ తెలుసు. ఆ విష్ణుదేవుని నాభిలో గలది తామరపుష్పం అని, దాని నుండి బ్రహ్మ దేవుడు ఉద్భవించాడన్న విషయం కూడ జగద్విదితం. అట్లాగే.. తామర పుష్పం సూర్యుడు వెలిగిన వేళ వికసిస్తూ, సూర్యాస్తమయ వేళకు ముడుచుకొంటుంది. కాబట్టి, తన చేయి అడ్డు పెట్టి తన భర్త కుడి కన్నును మూయడం ద్వారా సూర్యుని కిరణాలు ఆగిపోయి, ఆ విష్ణుమూర్తి నాభి లోని తామర పూవును ముడుచుకొనేలా చేసి, తద్వారా ఆ బ్రహ్మను నిద్రించేలా చేసి, భర్త శృంగార చేష్టకు సహకరించిందన్న మాట. అది చూసి నవ్వుతూ ఆ విష్ణువు ఆనందించాడని పొనగంటి తెలగనకవి భావం. "సిరులమెరుంగుబోడి", "సిబ్బెపు గబ్బి గుబ్బలు", "వెన్నుడు" వంటి అచ్చ తెనుగు పదాలు ఈ పద్యంలో అలరిస్తాయి.

ఒక మహమ్మదీయ ప్రభువును "హైందవ మతాలవాలమైన దైవం ఆశీర్వదించు గాక!" అని కవి ఈ కృతి కర్త అంకితం చేయడం, కృతిభర్తగా ఆ అన్యమత ప్రభువు దానిని ఆనందంగా ఆమోదించడం ... ఆనాటి మత సామరస్య వాతావరణాన్ని మన కళ్ళ ముందు ఉంచుతున్నది.

→ వేంకటేశ్వర విజయవిలాస కర్త గణపవరపు వేంకటకవి (17వశతాబ్దం) వింశత్యవధానములన్ ఘటియించు లక్షణ కవి వరుడనని చెప్పుకొన్నాడు. ఇలా 1850 కి పూర్వం అనేక పర్యాయణలు, అనేక స్థలాలలో అవధాన ప్రస్తావన ఉన్నప్పటికి అయా అవధానాల స్వరూప స్వభావాలు, నిర్వహణా విధి విధానాలు తెలియరాలేదు. వైయక్తిక ప్రతిభాపరిమితమైన ఆ అవధాన సామర్థ్యం ఆధునికమైన ప్రదర్శన కళగా పరిణమించిన క్రమంలో తీర్థఘట్టాల వంటి మహనీయులు ఎందరో ఉన్నారు. అవధాన విద్యకు వారి యోగదానం నిరుపమానమైనది. అవధానంలో వివిధ అంశాలను చేర్చి రాజాస్థానాలలో రాజులను మెప్పించి, పండితులను ఢీకొని కవితా రాజసాన్ని ప్రదర్శించి కనకాభిషేకాది గౌరవాలను పొందిన అవధాన చక్రవర్తులు నాటికి నేటికి విరాజిల్లుతూనే ఉన్నారు.

ఆ మహనీయుల వరివస్యను స్మరించుకొంటూ ఉత్సాహాన్ని నింపుకొని భావితరాలకు అవధాన విద్యను పదిలంగా అందించే ప్రయత్నం చేద్దాం.

పద్యపరిమళం

శ్రీవాణీ గిరిజాశ్చిరాయ దధతో వక్షోముఖాంగేషు యే
లోకానాం స్థితి మావహన్త్యవిహతాం స్త్రీ పుంస యోగోద్భవాం
తే వేదత్రయ మూర్తయ స్త్రిపురుషా స్సంపూజితావ స్సురైః
భూయాసుః పురుషోత్తమాంబుజ భవశ్రీకంధరాః శ్రేయసే ॥

ఈ పద్యం / శ్లోకం ఆంధ్రమహాభారతం లో మొట్టమొదటిది. కర్త నన్నయ భట్టారకుడు. సంస్కృత కావ్యాన్ని ఆంధ్రీకరిస్తూ ప్రారంభంలోనే సంస్కృత శ్లోకమా ? నన్నయ్యకు సంస్కృతమం దభిమానము, తద్భాషా పాండిత్యము మిక్కుటముగా కలవు కనుకనే సంస్కృత శ్లోకంతో ప్రారంభించినాడని కొందరి యభిప్రాయము.

అసలు విషయమేటంటే, నన్నయ్య భారతాంధ్రీకరణకు పూనుకొన్న సమయంలో కవిత్వమంటే సంస్కృతమే, తెలుగు కవిత్వం కవిత్వమే కాదు అనే ధోరణి తెలుగు వారిలోనే బలంగా పాతుకొని ఉంది. ఆ పరిస్థితిలో రాజరాజనరేంద్రుని కోరిక మేరకు మహాభారతసంహితారచన బంధురుడై, ముందుకు సాగాలంటే ఈ తూష్ణీంభావ మనస్కులను దాటుకొని వెళ్ళవలసిన అవసరమేర్పడి, ఈ శ్లోకంతో వారికొక నమస్కారబాణం సంధించినాడు నన్నయ్య.

సంస్కృత వృత్తాలను తెలుగులో ఉపయోగించినప్పుడు నన్నయ్య సంస్కృతంలో లేని యతి ప్రాసలను నిర్దేశించినాడు. నన్నయ్యను గౌరవిస్తూ అనంతర కాలంలో లాక్షణికులు కూడా ఛందోగ్రంథాలలో ఆ విధంగానే సూత్రీకరించినారు. కానీ నన్నయ్య ఈ శ్లోకాన్ని శార్దూల వృత్తంలో వ్రాసినప్పటికీ, యతి ప్రాసల నియమాలను పాటించకుండా సంస్కృతాభిమానులను చల్లబఱచి తన మార్గాన్ని నిష్కంటకం చేసికొన్నాడు.

సంస్కృత శ్లోకంతోనే మొదలు పెట్టినా, తదుపరి తత్సమ, తద్భవ, దేశ్య, గ్రామ్య పదప్రయోగాలతో తెలుగుదనాన్ని హత్తిస్తూ, అదే సమయంలో సుదీర్ఘ సంస్కృత సమాసాలతో సనాతనులను ఒప్పిస్తూ ముందుకు సాగినాడు.

శ్లోకార్థాన్ని చూస్తే – చిరకాలం (ఆది) నుండి లక్ష్మీ, సరస్వతి, పార్వతులను (క్రమంగా) వక్షస్సు, ముఖము, శరీరము లందు ధరించుచున్నవారును, నిరంతరాయంగా స్త్రీపుంస యోగోద్భవమైన లోకాల స్థితి నిర్వహించుచున్నవారును, వేదత్రయ స్వరూపులును, దేవతలచే పూజింపబడుచున్నవారును, అయిన విష్ణు, బ్రహ్మ, మహేశ్వరులు మీకు శ్రేయస్సు కలుగజేయుదురు గాక !

ఇది ఈ శ్లోకం యొక్క బాహ్యార్థం. లోతుగా పరిశీలిస్తే (నన్నయ గారే "లో నారసి" అనే పదాన్ని ప్రయోగించినారు) నన్నయ "నారాయణ" శబ్దభవము. అదే విధంగా తిక్కనకు కవి"బ్రహ్మ" అని, ఎఱ్ఱనకు ప్రబంధ "పరమేశ్వరుడు" అని బిరుదులున్నాయి.

విశ్వనాథ వారు నన్నయను ఋషితుల్యుడన్నారు. ఋషివాక్కు భవిష్యవాణి. భారతాంధ్రీకరణము నారంభించిన నాటి నుండి సంపూర్ణమగువరకు దాదాపు మూడు శతాబ్దాలకాలం పట్టింది. "చిరాయ దధతః" అనే పదబంధ ప్రయోగం ఈ విషయాన్ని, "త్రిపురుషా :" అనే పదబంధ ప్రయోగం కవిత్రయం యొక్క సమష్టి ప్రయత్నాన్ని సూచిస్తున్నాయి. ఈ రెండు విషయాలను "ఋషి వంటి నన్నయ్య" మొదలే దర్శించినాడనవచ్చును. ఉద్దేశ్యపూర్వకంగా నన్నయ్య ఈ పదబంధాలను ప్రయోగించినాడో లేదో కానీ, ఋషికల్పుడు కనుక పరమేశ్వరుడే ఆయన నోట పలికించియుండవచ్చును !

ఇదే విషయాన్ని నన్నయ్య తన చివరి పద్యమైన "శారదా రాత్రులుజ్జ్వల............ " అనే పద్యంలో పునరుద్ఘాటించినాడు. ప్రకటనావిధానంలో, పదప్రయోగంలో కొంత వ్యత్యాసమున్నప్పటికీ, భావభేదం లేదు. ఒకే విషయాన్ని పునరుక్తిగా చెప్పినాడనగా... అదే సత్యమైనదనగా.... . నన్నయ్య ఋషి కాక మరేమిటి ?

- అన్నమరాజు ప్రభాకరరావు

మనవి

ఈ పత్రికలోని రచయితలు, కవుల అభిప్రాయాలన్నీ అవధాన విద్యా వికాసం కోసమే

- పత్రికకు వ్యాసాలు, పద్యపూరణలు పంపేవారు యూనికోడ్ లో ఓపెన్ టెక్స్ట్ ఫైల్ రూపంలో మాత్రమే పంపండి.
- PDF , Photo copy రూపంలో పంపినవి స్వీకరించలేము.
- కవులు, రచయితలు తమ పేరు, ఊరు, ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయండి.
- అవధాన విద్యా వికాస పరిషత్ సమూహంలో కానీ 9441039146 వాట్సాప్ కు **"అవధాన పుష్కరిణిలో ప్రచురణార్థం"** అని వ్రాసి మీ రచనలు పంపవచ్చు.

- సంపాదకులు

అమ్మ దయ ఉంటే...... అన్నీ ఉన్నట్లే.

పద్యపరిమళం

తుండము నేకదంతమును తోరపు బొజ్జయు వామ హస్తమున్
మెండుగ మ్రోయు గజ్జెలును మెల్లని చూపులు మందహాసమున్
కొండొక గుజ్జు రూపమున కోరిన విద్యల కెల్ల నొజ్జయై
యుండెడు పార్వతీ తనయ! ఓయి గణాధిప! నీకు మ్రొక్కెదన్.

ఎవరు వ్రాసిన పద్యమో నాకు తెలియదు కాని, చాల విశిష్టమైన పద్యం.

పార్వతీ తనయ!.. వినాయకుడు అమ్మకూచి. పార్వతీదేవి నలుగుపిండితో బొమ్మ చేసి, ప్రాణంపోసింది కదా! అందుకని ఆ స్వామి అమ్మకూచి. "పార్వతీ తనయ!" అని పిలిస్తే పరవశించి పోతాడు.

ఓయి గణాధిప! నీకు మ్రొక్కెదన్.. దైవాన్ని ఆరాధించటం అంటే అనుసరించటమే. ఆ స్వామి గణాధిపుడు ఎలా అయ్యాడు? అమ్మ నాన్నలను సేవించి, భూప్రదక్షిణ పుణ్యఫలాన్ని పొంది గణాధిపుడు అయ్యాడు. తల్లిదండ్రులను ప్రేమగా చూసుకునే ప్రతి పుత్రుడూ సమున్నతస్థానము పొందగలడని ఉదాహరణ పూర్వకంగా ఉపదేశిస్తున్నాడు గణాధిపుడు.

ఇంతకూ ఈ గణపతి ఎలాంటివాడు? ఆ స్వామికి అన్నీ అసౌకర్యాలే.

తుండము.. ఉన్న తల ఎగిరిపోయి ఏనుగుతల వచ్చి చేరింది. ఆ తలకు ఒక తొండం. తన బిడ్డ చక్కగా భోజనంచేసి, పుష్టిగా, ఆరోగ్యంగా ఉండాలని ప్రతి తల్లీ ఆశపడుతుంది. కాని, వినాయకుడికి ఆ అవకాశంలేదని ఆ తల్లిఆవేదన. సుఖంగా, సౌకర్యంగా ఆహారం నోటిలో పెట్టుకోవటానికి తొండం అడ్డుగా ఉన్నది.

ఏకదంతమును.. పోనీ, ఆ తిన్న కాస్తయినా హాయిగా నమిలి తినగలడా? అంటే, ఆ అవకాశమూ లేదు. ఉన్నది ఒక్కటే దంతం.

తోరపు బొజ్జయు.. ఆ తిన్న కొంచెం ఆహారం తన బిడ్డకు ఎక్కడ సరిపోతుంది? పెద్ద బొజ్జ కదా! చకచకా వంటకాలన్నీ తీసుకోవాలంటే, 'తోరపు బొజ్జ' అడ్డుగా ఉన్నది. కడుపు నిండా తినే అవకాశం ఏది? అని ఆ తల్లికి దిగులు.

వామ హస్తమున్.. పోనీ, పళ్ళెంలో ఉన్నవన్నీ అందుకుని, చకచకా నోటిలో పెట్టుకో గలడా? అంటే, పాపం! అదీ కష్టమే. పొడవైన చేతులు ఏవి? పొట్టి(అందమైన) చెయ్యి.

మెండుగ మ్రోయు గజ్జెలును.. కడుపునిండా తిని హాయిగా ఉండే అవకాశం తన బిడ్డకు లేదని ఆ తల్లికి ఒకటే దిగులు.

అతణ్ణి గొప్ప కళాకారుడిగా తీర్చి దిద్దితే, అప్పుడు లోకం అతణ్ణి ఆదరిస్తుంది కదా! అని ఆలోచించి, తన బిడ్డకు నాట్యం నేర్పించాలనుకుంది ఆ తల్లి. నాన్నవలె నాట్యంలో మంచి పేరు తెచ్చుకుంటాడని ఆశతో. అందుకని ఘల్లు ఘల్లుమని మ్రోగే మువ్వలున్న అందెలు తెచ్చి, తన బిడ్డపాదాలకు అలంకరించింది ఆతల్లి.

మెల్లని చూపులు.. నాట్య కళాకారుడు తన కన్నులలో చక్కని హావభావ విలాసాలను ప్రకటించి మంచి పేరు తెచ్చుకోవచ్చు. కానీ గణపతికి ఆ అవకాశంకూడా లేకపోయింది.

ఏనుగుముఖం కదా! చిన్న చిన్న కన్నులు. వాటితో చురుకుగా ఏమి చూడగలడు? కళ్ళు విశాలంగా పెద్దవిగా ఉంటే కదా! కనుక, తన బిడ్డ నాట్యకళా విశారదుడై, పేరు ప్రఖ్యాతులు తెచ్చుకునే అవకాశంకూడా లేదని ఆ తల్లికి మరో దిగులు.

మందహాసమున్.. చిరునవ్వుల సిరివెన్నెల కురిపిస్తూ, అందరినీ అలరిస్తుంటే, కనీసం అలా అయినా అతడు ప్రసిద్ధుడు అవుతాడు. తన బిడ్డకు ఆ అవకాశం కూడా లేదని ఆ తల్లిబాధ. ఏనుగుముఖంతో నవ్వినా ఏమి కనిపిస్తుంది? ఆ నవ్వు మందం గానే ఉండిపోతుంది కానీ చురుగ్గా ఎలా ఉంటుంది?

కొండొక గుజ్జు రూపమున.. ఏమి ఉన్నా, ఏమి లేకపోయినా ఆ మనిషి ఆజానుబాహువు అయితే, అందరి దృష్టినీ ఆకర్షించ గలుగుతాడు. కానీ వినాయకుడు పొట్టివాడుకదా!

అదీ ఆ తల్లికి దిగులే.

కోరిన విద్యల కెల్ల ఒజ్జయై.. తన బిడ్డకు ఎన్ని లోపాలున్నా, అతడు గొప్పవాడు కావాలనీ, అందరూ తన బిడ్డను గౌరవించా లనీ ఆరాటపడటం తల్లికి సహజం. అందుకని, ఆ తల్లి బాగా ఆలోచించి తన బిడ్డను అన్ని విద్యలకూ అధిపతిని చేసేసింది.

ఇక, లోకంలో ఎవరు ఏ విద్యలో రాణించాలన్నా, వినాయకుణ్ణి ఆరాధించ వలసిందే.

అలా ఎన్ని లోపాలున్నా, అమ్మకూచి అయిన ఆ 'పార్వతీ తనయుడు' తల్లిదండ్రుల ఆరాధనతో 'గణాధిపుడు' అయ్యాడు.

అమ్మ అనుగ్రహంతో "కోరిన విద్యల కెల్ల ఒజ్జ" అయ్యాడు.

తల్లిదండ్రులసేవ చేయగలిగితే, అమ్మప్రేమను పొందగలిగితే ఆ బిడ్డ అభ్యుదయానికి అతడిలోని ఏ లోపమూ అడ్డురాదు. అందుకని

"అమ్మను నమ్ముకుందాం. అమ్మ అనుగ్రహంతో అఖండ విజయాలు సాధించుకుందాం" అంటున్న గణపతికి (మ్రొక్కెదన్) వందనం.

మామూలు మాటలతో మహనీయ తత్త్వాన్ని వెలార్చిన ఈ గణపతి ప్రార్థన పద్యంలో ఎన్ని భావపరిమళాలో!

- ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

కాశీలో దర్శనమ్ అవధాన సప్తకం

గురుసహస్రావధాని
డా. కడిమిళ్ళ వరప్రసాద్ అష్టావధానం

27.07.2025

అధ్యక్షులు - శ్రీమాన్ పి.టి.జి.వి.రంగాచార్యులు
సంచాలకులు - సహస్రావధాని శ్రీ కోట లక్ష్మీనరసింహం

అధ్యక్షులపై పద్యం-
మాటలలో చేతలలో
పూటకు బూటకును ధర్మమును నిలబెట్టెదవే
పీటీజీవీ రంగా!
ధాటి కలుగునట్టి కార్యదక్షుడవయ్యా!

సంచాలకులపై పద్యం
కోటన గోటకాడు నుడికోటకు గోటను గట్టినట్టి యీ
కోటయె పగ్గముల్ గొనిన కుమ్మెద నక్షరబాణపంక్తులన్
పోటు గలట్టి ప్రష్టృచయమున్ శివమెత్తుచు నెత్తివచ్చినన్
నాటవు వారి బాణము లనారతమున్ విజయుండ నయ్యెదన్॥

సమస్య- శతావధాని శ్రీమాన్ నారాయణం బాలసుబ్రహ్మణ్యం
ధాత్రిన్ బెక్కురు గల్గినన్ హృదయసంతాపమ్ము తగ్గించు స
చ్ఛాత్రుండాతడె సద్గురుండతడె రాసక్రీడ యవ్వానిదే
పాత్రుండాతడె భైష్మి వాని వలచెన్ బద్మాక్షుడౌ దేవకీ
పుత్రుండే తగ భర్తయౌచు దనకున్ బుత్రున్ బ్రసాదింపడే॥

దత్తపది- శ్రీ ఎమ్ వి ఎల్ ఎన్ ప్రసాద్
"అలక, పులక, మొలక, చిలుక"- బాలరాముని వర్ణన
చం. **అలక**లు మోముపై కదలునప్పుడు నాట్యవిశేషవైఖరిన్
బులకలు మోసులెత్త రసపూర్ణుడు రాముడు బాల్యమందునన్
మొలకలు చేవదీరినటు పూర్ణవివేకము వింగడింపగా
చిలుకలు పల్కసాగినవి చిట్టినుడుల్ శ్రుతులయ్యె నయ్యవే॥

వర్ణన-శ్రీమతి మరుమాముల రుక్మిణి
కృష్ణుడు కాళియమర్దన సమయంలో చేసిన నృత్యం
విషరాశిన్ విషధరునిన్
విషమాంఘ్రుల నర్తనమున వేచిన కృష్ణా!
ఋషివో ఋషిదేశికుడవో!
కృషి చేసినయంతమాత్ర కీర్తి కలుగునే॥



నిషిద్ధాక్షరి- శతావధాని ఆముదాల మురళి - శిష్యోత్సాహము
శ్రీ మనగా నిల బొత్త
మ్మే మతియై చట్టునిసువులే యున్నయెడన్
ఆమెతలు గురులకవియే
ప్రామాణికమౌను శిష్యబంధమ్మొకటే॥

వ్యస్తపాది - ఝాన్సీలక్ష్మి కాశికాక్షేత్రవైభవం
3పా. వర్తన్తే యత్ర తత్కాశీ అన్నపూర్ణావిశాలాక్షీ
1పా. అన్నపూర్ణా విశాలాక్షీ విశ్వేశ స్సురవాహినీ
4పా. సాక్షాత్ కైలాసభూమికా వర్తన్తే యత్ర తత్కాశీ
2పా. విశ్వేశ స్సురవాహినీ సాక్షాత్ కైలాసభూమికా॥

ఆశువు-
1. తెలుగు భాష
మల్లెపూవులోని మకరందబిందువు
గుమ్మపాలలోని కమ్మదనము
వెన్నముద్దలోని వింతమెత్తదనమ్ము
తెలుగునందు గలదు నిలుపుకొనుము॥

2. ఆపరేషన్ సిందూరలో ప్రాణాలు వదలినవారి కుటుంబాలకు
మోదీ సాంత్వనం
దేశముకోసము ప్రాణము
వీసమ్మెత్తంచు దలచి వెడలినవారిన్
ఊసులతో జేతలతో
వాసిని హెచ్చించినావు భళిర నరేంద్రా!

పురాణం - అవధాని శ్రీ సురభి శంకరశర్మ
అప్రస్తుతం -అశోక్ గుప్తా

ముంబయి అవధానవేదిక ఆధ్వర్యంలో డా. బోరెల్లి హర్ష (జూమ్) అష్టావధానం

14.08.2025 నిర్వహణ: గెంటేలజగదీశ్చంద్రకుమార్

నిషిద్ధాక్షరి: యడవల్లి భానుప్రియ

అంశము: శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతమును ఎత్తుట

కం. (శ) గో(వ)ర(మ)క్ష(జ) స్థ(గ)లి(లో)నీ(గ)వే/
(స)ధీరా!(గ)త్మా!(వ) యా(త)ద(వ)రి(ప)ని(వ)క దిక్కై (గ) బ్రో(న)చం/

గోరక్షస్థలి నీవే
ధీరాత్మా!యాదరినిక దిక్కై బ్రోచం
గా రౌద్రము వేలికొనన్
భారము మోయన్ నిలిపిన భాగ్యము కృష్ణా!

సమస్య: భైరపనేని పోతురాజు చౌదరి

వ్రాత విధాత చేతబడి వన్యవిహారము ప్రాప్తమయ్యెనే
చేతములుగ్రరూపమునజేరెను మంటలు లక్క యింటిలో
నాతినితల్లియానగొని నారిహిడిబనుచిత్రసీమలో
సీతనుగాంచి భీముడనె శీఘ్రము రమ్మిటు పెండ్లియాడెదన్.

దత్తపది: విమల ఆర్యసోమయాజుల

"దండ" మాల అనే అర్థం రాకుండా నాలుగుపాదాలలో రామాయణార్థంలో... శార్దూలంలో

వేదార్థాంశము మానవాకృతి గొనన్ వేదండమౌ రాముడే
పాదం బూని దురాత్ముల్ సంతతుల దర్పంబూడ్చి కోదండమున్
మైదానంబున నుగ్రయుద్ధమున శ్రీమంతంబు నౌదండుతో
నా దివ్యాత్మ ఉండు రాక్షశాళికిడె తద్నాకంబు దండంబునన్.

న్యస్తాక్షరి: నేమాని సోమయాజులు

ఉ. కామిత దాయకా సుగుణ **'గ'**ణ్య విశేష విశాల కాయ, నిన్
నామది వేడెదన్, కణక**'ణ'** ద్యుతి నీవగు విఘ్న నాయకా!
భామలు సిద్ధి బుద్ధులను **'ప'**ర్వమొనర్చిన బ్రహ్మచారివే బీ
ధీమతి వై వెలుంగులిడి **'తి'**క్కలు దీర్చుమ దీనబాంధవా!!

వర్ణన: పోణంగి త్యాగరాజు

బుద్ధుడు అడవులకు ప్రస్థానిస్తున్నప్పుడు, అతని భావన

శా. కార్యాకారణ మైత్రి నిత్యమని సత్కామ్యార్థ చిత్తుండనై
భార్యన్ బిడ్డను వీడి లోకమునకున్ బాధల్ నివారింపగా
ధైర్యంబౌ నొకమార్గమున్ వెదకి సత్యానందమున్ పొందగా
క్రౌర్యంబున్ విడి శాంతి నిల్పుటకునై కాంక్షింప వైరాగ్యమున్

ఆశువు: ఇరువింటి దుర్గామాధురి

1. ప్రదోష వేళ కైలాసముపై వర్ణన

సత్వ రూఢి దెల్పు శక్తి జావల్యంబు
శివుడు నిల్పునట్టి చిత్తమదియె
నీలలన్ని వీడి కైలాసవీధిలో
చూడవలెను శివుని జాడ మనము.

2. పురాణములలో గజములపై పద్యము:

ఆడుచుంటిని పాడుచుంటిని ఆడువారల తోడుగా
ఈడు వద్దది కాలి ముంగిట క్రూర జంతుల పాలిటన్
మాడిపోతిని మ్రగ్గిపోతిని మార్పు చెందెను దేహమున్
వేడుకొందును విష్ణుమూర్తిని వేగ రమ్మిట కావగన్.

అప్రస్తుతం: వారణాశి శ్రీలేఖ

1. రావణకాష్టం అలా కాలుతూనే ఉంటుంది అంటారు కదా ... దానిలో ఏ దినుసులు వేశారు ?

జ. అధర్మం

2. ఈ మధ్యకాలంలో అమ్మాయిలు అబ్బాయిలు అదేపనిగా మనసు పారేసుకుంటున్నారు కదా ... ఎలా పారేసుకుంటున్నారంటారు ? నెమ్మదిగానా లేక అలా విసిరి పారేస్తున్నారా ?

జ. పారేసుకునే అవకాశం ఎక్కడ ఉన్నది.., వారి మనసు పడిపోయేంత బలహీనంగా ఉంటేనూ

3. శివుడు శరీరం పైన విష్ణువు పక్కగా చేసుకుని పాములను తమతోనే ఉంచుకున్నారు మరి బ్రహ్మదేవుడు పామును తన దగ్గర ఉంచుకోకుండా ఎందుకు వదిలేసాడంటారు ?

జ. పడుకోవటానికో లేదా అలంకరణ కోసమో సమయమెక్కడ..? భారతీయులు చైనీయులు ఆయనచేత ఓవర్‌టైమ్ డ్యూటీలు చేయిస్తూ ఉంటేను..! *(సేకరణ: ఆరవల్లి శ్రీదేవి)*

తటిల్లతలు

ప్ర: స్వర్గలోకం శ్రీనాథుడు, శ్రీ శ్రీ కలుసుకున్నారనుకోండి. వారేం మాట్లాడుకుంటారో పద్యం చెప్పండి.

స: శ్రీశ్రీ – "మీలో కన్నను నాలో
శ్రీలే మరి అధికమయ్యె శ్రీనాథయ్యా!
శ్రీనాథుడు– శ్రీలను ముందుగ గల్గియు
శ్రీ లేకనె పోయినాము శ్రీ శ్రీ గారూ!"

(ఇద్దరు కవులకు పేరులో శ్రీ ఉంది గాని చనిపోయేటప్పుడు దరిద్రంతోనే వెళ్ళిపోయారనే విషయాన్ని చమత్కారంగా ఆశువులో పండించటం అవధాని ప్రత్యేకత.)

డా. రాళ్ళబండి కవితాప్రసాద్ 'శతవధానకవితాప్రసాదం నుండి

నిఘంటు పరిజ్ఞానం

1 శతావధాని
ఆముదాల మురళి

అవధానికి నిఘంటు పరిచయం మాత్రమే సరిపోదు, అందులో లోతైన పరిజ్ఞానం ఉండాలి. పదానికి అర్థాన్ని తెలియజేసేది నిఘంటువన్నిది ప్రాథమిక అవగాహన. ఆ పదం దీర్ఘాంతమా? హ్రస్వాంతమా? స్త్రీలింగమా? పుంలింగమా? మొదలైన విషయాలతో పాటు అది నామవాచకమా? సర్వనామమా? అనే విషయాన్ని కూడా నిఘంటువు తెలియ జేస్తుంది. ఆ వివరాలు తెలియకుండా పదాన్ని ప్రయోగిస్తే శాబ్దిక, ఆర్థిక దోషాలు కలుగుతాయి. కొన్ని చోట్ల అతివ్యాప్తి, అవ్యాప్తి దోషాలు కలుగడమే కాక ఔచిత్యభంగం కూడా వాటిల్లుతుంది. నిర్దోషంగా కవిత్వం చెప్పడం, కావ్యశాస్త్ర సిద్ధాంతాల ప్రకారం పద్యమల్లడం అవధాని ప్రథమ కర్తవ్యం.

అలా చేయాలంటే పద పదార్థాల మీద అధికారం ఉండాలి. ఒక పదానికి అనేక అర్థాలుంటాయి. అదే విధంగా ఒక అర్థాన్ని తెలిపే అనేక పదాలుంటాయి. ఏ పదానికి ఏ అర్థం అని తెలిసినా ఆ అర్థంలో ఆ పదాన్ని ప్రయోగించవచ్చునో లేదో తెలిసి ఉండాలి. ఉదాహరణకు చంద్రునిలోని మచ్చ కారణంగా అది కుందేలు (శశము) ఆకారంలో ఉన్నదని భావించి చంద్రుని 'శశి' అంటారు. అదే మచ్చ మృగం ఆకారంలో ఉన్నదని కూడా భావిస్తారు. ఆ కారణంచేత చంద్రుని 'మృగాంకుడు' అంటారు. మృగము కలిగిన వాడు అన్న అర్థంలో 'మృగీ' అనికూడా అనవచ్చు కదా! వ్యాకరణ పరంగా అది సాధురూపమే అయినప్పటికీ 'మృగీ' అన్న పదానికి 'ఆడుజింక' అన్నది రూఢి కనుక చంద్రుడన్న అర్థంలో 'మృగీ' అన్న పదాన్ని ప్రయోగించ రాదని శాస్త్రనిర్ణయం. సర్పి శబ్దం కూడా అట్టిదే. శూలమును ధరించినవాడు అన్న అర్థంలో శివునికి పర్యాయపదంగా 'శూలి' అన్న పదాన్ని ప్రయోగించ వచ్చును, కానీ సర్పమును ధరించినవాడు అన్న వ్యుత్పత్తి ఆధారంగా 'సర్పి' అన్న పదం శివునికి పర్యాయ పదంగా వాడరాదు. అందులకు కారణం 'సర్పి' శబ్దానికి 'నెయ్యి' అన్నది రూఢ్యర్థం కావడమే.

అలాగే కావ్యశాస్త్రాల్లో అప్రసిద్ధ పదప్రయోగం కూడా దోషమని పేర్కొనబడినది. సరస్వతీ కంఠాభరణ కర్త అసాధువు, అప్రయుక్తము, అనర్థకము, కష్టము, అన్యార్థకము, సందిగ్ధము, విరుద్ధము, గూఢార్థము, గ్రామ్యము మొదలగు పదహారు పదదోషాలను తెలియజేశారు. అవధాని లేదా కవి వీటిని తెలిసికొని దోషరహిత పదజాలాన్ని, ప్రకరణోచితంగా, ఔచిత్యంగా ప్రయోగించాలి. అలా కాని పక్షంలో పాఠకుని యందు రసోత్పత్తి జరుగదు. రసనిష్పత్తి కాని రచన నిష్ప్రయోజనం. ఈ కారణాల వల్ల పద, పదార్థ, ప్రయోగ జ్ఞానం అత్యంతావశ్యకం. ఇందులో పద, పదార్థాలకు నిఘంటువు ఆధారం. కాగా ప్రయోగజ్ఞానానికి పూర్వకావ్యపఠనం, కావ్యశాస్త్ర పఠనం హేతువులు.

ప్రాయికంగా నిఘంటువులు పర్యాయ వాచకాలు, నానార్థాలని రెండు విధాలుగా ఉంటాయి. పర్యాయ వాచకాలను విస్తృతంగాను, నానార్థవాచకాలను విరళంగాను వాడటం సహజం. అవధానికి రెండింటి పరిచయ పరిజ్ఞానాలుండాలి. అక్షరసంఖ్యాక్రమంలోనూ పదాంత అచ్చు, హల్లుల విభాగంతోనూ ఉన్న నిఘంటువులు కూడా ఉన్నవి. సాధారణంగా ఆద్యక్షరాలను అక్షరమాల క్రమంలో ప్రకటించిన నిఘంటువులే ఎక్కువగా ఉంటాయి. నిఘంటువులను తొలిదశలో పద్యరూపంలో(తెలుగు), శ్లోకరూపంలో రచించారు. సుప్రసిద్ధ అమరకోశం శ్లోకరూపమని అందరికీ తెలిసిందే. కంఠస్థ యోగ్యం కనుక ఇటువంటి రచన ఎంతో ఉపయుక్తమైనది. అమర కోశం ఒక పర్యాయ పద నిఘంటువు. అమరసింహుని రచన. క్రీ.పూ. ప్రథమశతాబ్ది నాటిది. "అష్టాధ్యాయీజగన్మాతాఽమరకోశో జగత్పితా" అన్నది లోకోక్తి. అవధానికి వ్యాకరణం, నిఘంటుజ్ఞానం తల్లిదండ్రుల వంటివే. ఒకానొక సందర్భంలో భాషాభేదం లేని భారతి "అమరం చదువని వానికి నేనమరను" అన్నదట. నిన్న మొన్నటి వరకు పఠన పాఠనాలు అమరంతోనే ఆరంభమయ్యేవి.

అమరకోశంలో మూడు కాండలున్నవి. ప్రథమకాండలో స్వర్గ, వ్యోమ, దిక్, కాల, ధీ, వాక్, శబ్దాది, నాట్య, పాతాళ, భోగి, నరక, వారి వర్గములను 12 వర్గములున్నవి. ద్వితీయకాండలో భూ, పుర, శైల, వనౌషధి, సింహాది, మనుష్య, బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్గములను 10 వర్గములున్నవి. తృతీయ కాండములో విశేష్య నిఘ్న, సంకీర్ణ, నానార్థ, అవ్యయ, లింగాది సంగ్రహ వర్గలని 5 వర్గములున్నవి. దీనికి అరవైకి పైగా వ్యాఖ్యానాలున్నవి. అందులో ప్రసిద్ధమైనది గురుబాలప్రబోధిక వ్యాఖ్య, దీనిని తాళ్ళపాక అన్నమాచార్యుల మనుమడైన తాళ్లపాక తిరువేంకటాచార్యుల వారు తెలుగు అనువాదంతో కలిపి రచించారు. అవధానుల పాలిట ఈ వ్యాఖ్యానం, కోశం రెండూ కల్పవృక్షప్రాయములు. ఇందులో సుమారు 8850 పదాలు, వాటి అర్థాలు, ఆ పదము యొక్క లింగాది పరిజ్ఞానము, వానికి మూల ధాతువులు, వ్యుత్పత్తి – ఇంత సమాచారం లభిస్తుంది. అవధాని ఏ ఛందస్సులో పద్యం మొదలు పెట్టినా యతి ప్రాసల వద్ద ఆగకుండా, గణభంగం కాకుండా హాయిగా సాగడానికి ఇంతకు మించిన సరంజామా అక్కర్లేదు. ఇక నిఘంటువు లోనికి ప్రవేశిద్దాం.... **(సశేషం)**

పూరణతోరణం

నిర్వహణ: 'అష్టావధాని' కంది శంకరయ్య

సమస్య

చెలి వడ్డించెను ప్రాణవల్లభునకున్ జింతాకులోఁ బ్రేముడిన్

1. అక్కెర కరుణా సాగర్, హనుమకొండ
తొలిచూపున్దమ కన్నులేకమయి సంతోషాబ్ధి గ్రీడించుచున్
మలిచూపున్మమతానురాగముల ప్రేమాస్వాద మోహాత్ములై
చెలువారంగ వివాహ బంధమున సుశ్రేయంపు దాంపత్యమున్
జెలి వడ్డించెను ప్రాణవల్లభునకున్ జింతాకులోఁ బ్రేముడిన్.

2. అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి (అసనారె), హైదరాబాదు
వలపున్ చిందగ జేయుచున్ సతము సంభావించు నర్ధాంగి కౌ
గిలిలో స్వర్గ సుఖమ్ములన్ మునుగుచున్ గేస్తుండు దీపింపగా
పలు ఖాదమ్ముల తోడ నాదినమునన్ పప్పున్ కదంబించి, నే
చ్చెలి వడ్డించెను ప్రనవల్లభునకున్, జింతాకులో బ్రేముడిన్.

3. కటకం సూర్య నారాయణ మూర్తి
మ. తొలి సంక్రాంతికి నల్లునిన్ బిలిచి సంతోషంబునన్ గాన్కగా
చెలువౌ రాజిత పళ్ళెరం బొసగిరా జింతాకు రూపంబునన్
చెలగెన్ మానసమా స్మృతుల్ మెరయగా చిర్నవ్వు చిందించుచున్
చెలి వడ్డించెను ప్రాణవల్లభునకున్ జింతాకులో ప్రేముడిన్.

4. కవుతా రామకృష్ణ
వల పౌటన్ బహుపుత్త్రకుం డొకనికిన్ భక్షింప నింపైన పొం
గలిఁ, గాంతామణిఁ జేయఁ గోరి, చని తాఁ గార్యార్థమై, వచ్చె నా
కలితో భోజనవేళకున్, మెతుకులన్ గాలించుచున్ గీరుచున్
జెలి వడ్డించెను ప్రాణవల్లభునకున్ జింతాకులోఁ బ్రేముడిన్.

5. కృష్ణ విరజ
వలపుల్ హెచ్చగ చంచలాక్షి పతికై బంగారు చింతాకుతో,
జిలుగుల్ చెక్కిన ముద్దు పళ్ళెమును సంసిద్ధమ్ము చేయించి, జి
హ్వాల చాపల్యము లెల్లఁ దీర రుచిగా పాకమ్ములన్ జేసి, నె
చ్చెలి వడ్డించెను ప్రాణవల్లభునకున్ జింతాకులో ప్రేముడిన్.

6. గుంటి విష్ణుమూర్తి, వరంగల్
కలలో బాల్యపు నాటలందు దనకున్ గల్యాణమున్ జేయగా
హలమున్ జేకొని చేర నిల్లు పతిగా నాటాడు నేస్తమ్ముపై
వలపున్ జూపుచు చిన్ని పాత్రమున నొప్పారంగఁ దా వేడ్క నె
చ్చెలి వడ్డించెను ప్రాణవల్లభునకున్ జింతాకులోఁ బ్రేముడిన్

7. గుండా వేంకట సుబ్బ సహదేవుడు, ప్రొద్దుటూరు
వలపుల్ చిందుటె కాదు నా సతియె యస్వాదించెడున్ వంటలన్
బలుమారుల్ దిని పల్వరించు గతిలో పళ్లెంబునన్ గూర్చెడున్
బులుపున్ కారమునుప్పుతోడ పొడుమౌ ముద్దంచు వర్షాన నె
చ్చెలి వడ్డించెను ప్రాణవల్లభునకున్ జింతాకులోఁ బ్రేముడిన్

8. గుర్రం మల్లేశం, దుద్దెడ, సిద్దిపేట జిల్లా
తొలి చూపందున తెల్లవారెననగన్ తోమాలసేవుండగన్
కలికాలంబిది క్రూరకారులె గదా కాటేయ జూడంగ నా
తెలి జామందున మేల్క గాంచ గనుచున్ తేనీరు ద్రావించగన్
చెలి వడ్డెంచెను ప్రాణవల్లభునకున్ జింతాకులో ప్రేముడిన్.

9. చేపూరి శ్రీరాం, హన్మకొండ
విలసచ్ఛీల మనోజ్ఞ రూప కలనా విజ్ఞాన సందీప్తులై
అల సాధ్వీమణులెందరో వెలసి రార్యావర్త దేశమ్ములో
నలవోకన్ పతి భక్తి భాగ్యమున జింతాకే సువిస్తారమై
చెలి వడ్డించెను ప్రాణవల్ల భునకున్ జింతాకులో ప్రేముడిన్.

10. జి.లింగేశ్వర శర్మ, సిద్దిపేట
వలపున్బంచుచువీడకుండనుసదావాత్సల్యముప్పొంగగా
పిలుపుల్ మిక్కిలి ప్రేమపాత్రములతోప్రేమానుబంధమ్ముతో
తలపున్నిండుగభక్ష్యభోజ్యములనేతాదాత్మ్యభావమ్ముతో
చెలివడ్డించెను ప్రాణవల్లభునకున్ జింతాకులో ప్రేముడిన్.

11. డా. జంధ్యాల సుబ్బలక్ష్మి, హైదరాబాదు
నిలువెత్తన్నది పూర్వకాలముల నెంతే నుచ్ఛమై యుండగా
కలికాలాన క్రమక్రమంబుగ నరాకారంబు క్షీణింప నం
గులముల్ మూడగు నెత్తు గల్గ నది యెంతో దీర్ఘమై యొప్పుటన్
చెలి వడ్డించెను ప్రాణవల్లభునకున్ జింతాకులోఁ బ్రేముడిన్.

12. డా. బోరెల్లి హర్ష, కర్నూలు
తలపుల్ తియ్యని భావలాస్యములతో తందానలాడించ కౌ
గిలిఁజేరన్ హృదయాబ్ధిచంద్రుని మదిన్ గెల్వంగ గోరీగతిన్
చెలివడ్డించెను ప్రాణవల్లభునకున్ జింతాకులో ప్రేముడిన్
తెలవంకాయల వేఁచినూర్చిరసతంత్రిన్ మీటగ్రీష్మోష్మమున్.

13. డా. రఘుపతి శాస్త్రుల, నిజాంపేట, హైదరాబాద్
ఫలవంతంబగు జీవనమ్మనుచు తా వైవిధ్యమౌ రీతులన్
వలపుం జాటగ నెంచి యెవ్వరిడిరో ప్రాప్తింపగన్ భక్ష్యముల్ ?
తలపన్ చీమను పక్షి కాచె నెటులో? ధారాళమౌయేట? నె
చ్చెలి వడ్డించెను ప్రాణవల్లభునకున్! జింతాకులోఁ బ్రేముడిన్!

14. డా. రామడుగు వేంకటేశ్వర శర్మ, హైదరాబాద్
అల పల్కించెను విశ్వనాథ నిజ కావ్యంబందు నాధ్యాత్మికో
హలతోఁ బండ్లనొసంగుచున్ శబరి చే "ఆత్మేశ్వరా!" యంచు; శో

భల మాధుర్య సమస్య భక్తి మెయి సంభావించు! దోషంబె? నె
చ్చెలి వడ్డించెను ప్రాణవల్లభునకున్ జింతాకులోఁ బ్రేముడిన్.

15. డా. వరలక్ష్మి హరవే, బెంగుళూరు
తొలిపూజంచును వేడిరే దినగ నే తోష్యంపు ప్రాసాదమే
పలుమారుల్నట వద్దనల్ కొసరిరే పక్వంపు భక్షంబులే
సలిలంబున్ గొన నొల్లదే జఠరమే చాలింక సాపాటనా,
చెలి వడ్డించెను ప్రాణవల్లభునకున్ జింతాకులో ప్రేముడిన్.

16. పి.యల్. నాగేశ్వర రావు, హైదరాబాదు
తలలో నాల్కగనుండి పెన్మిటిని తత్ప్రాణంబుగా నెంచుచున్
గలనైనన్ విడియుండదా వనిత! ధిక్కారమ్ము లేదెప్పుడున్!
దలపుల్ వారికి వేరుకావు, మది తాదాత్మ్యంబునన్ విందునన్
జెలి వడ్డించెను ప్రాణవల్లభునకున్ జింతాకులో ప్రేముడిన్!!

17. పెనుకొండ రామబ్రహ్మం, బెంగుళూరు
అల నాఁడట్లు త్రిమూర్తులైరి యనసూయా త్రాణ మేపారఁగన్
నిలలోఁ బాపలు సాధ్వి బ్రాఁతిఁ గనునే యిచ్చించి ప్రార్థించఁగన్
వలపుల్ చిమ్మి పరీక్ష సేయ మగఁడే భావించి శాసించ నా
చెలి వడ్డించెను ప్రాణవల్లభునకున్ జింతాకులోఁ బ్రేముడిన్.

18. పేరి వేంకట సూర్యనారాయణ మూర్తి (అప్పాజీ) (అమెరికా)
తలపే సంపద యంచు భర్తనెడ తాఁ దాఛ్ఛీల్యమున్ సల్పుచున్
వలపున్ ధారఁగ హర్షవర్షమునుఁ దా భావంబునందుండఁగా
కలలో జాగ్రతయందు కూడ పలుకన్ క్రమంబునౌ చారు నె
చ్చెలి వడ్డించెనుప్రాణవల్లభునకున్ జింతాకులోఁబ్రేముఁడిన్.

19. భానుమతి హట్టి, హైదరాబాదు
తెలవారంగనె చింత కొమ్మ చిగురుల్ దివ్యంబుగావండగన్
నలిపెన్ వాటినిచేటలోన సతియేనైపుణ్యమున్ జూపుచున్
కలిపెన్ పప్పుయు,నుప్పుకారములనున్, కాసింతపోపందులోన్
చెలివడ్డించెను ప్రాణవల్లబునకున్ చింతాకులో ప్రేముడిన్.

20. మంకు శ్రీను, కొప్పర్రు, ప.గో. జిల్లా
చెలివాల్గన్నుల వెన్నెలల్ గురియగా శృంగారభావాబ్ధిలో
తలమున్కల్ వడి వోవుచున్ ప్రియుడు చిత్తప్రీతి సంధిల్లగా
పలికెన్ తత్ప్రియురాలితో నిటుల లేవం జూడుమీ చీమ నె
చ్చెలి వడ్డించెను ప్రాణవల్లభునకున్ చింతాకులో ప్రేముడిన్.

21. మాచవోలు శ్రీధరరావు, హైదరాబాద్
చలికాలంబున, వృక్షమూలమున, ఏ చాపల్యమున్ లేక, ఓ
మలిసంధ్యాసమయంబులోన మధురమ్మౌ పాకముంజేసి చీ
మల గేహంబున,కాదె నీదయన కామారీ!సతీ చీమయౌ
చెలి వడ్డించెను ప్రాణవల్లభునకున్ జింతాకులోఁ బ్రేముడిన్

22. మాడుగుల మురళీధర శర్మ, సిద్ధిపేట/కాళేశ్వరం
వలపుల్పంచుచు ప్రాణవల్లభునెడన్ వాంఛార్థసిద్ధ్యర్థమై
తలపున్ కమ్మని ధర్మకర్మనిరతిన్ తాదాత్మ్యతా మేనులోన్
పలురీతుల్ రససరమ్యచారు రుచులన్ బ్రహ్మాండ సౌశీల్య నె
చ్చెలి వడ్డించెను ప్రాణవల్లభునకున్ జింతాకులోఁ బ్రేముడిన్!

23. మాతా గంగాభవాని శాంకరీదేవి, విశాఖపట్నం
తొలిచూపందున దోచగా,మనసునన్ తుళ్ళింతగల్గంగనే
పలుకంగా ననురాగమౌ తలపులే భావింప మిన్నేరులై
కలికింపార మనోజ్ఞ మౌ ప్రియునినిన్ గాంచంగ సిగ్గె నటన్
చెలివడ్డించెను ప్రాణవల్లభునకున్ జింతాకులో ప్రేముడిన్.

24. మార్తాటి ఈశ్వరీ గోపాల రావు, సింగరాయకొండ
పులిహోరా వడ గారె పాయసము సంపూర్ణంబుగా విందులో
నలివేణీ! భుజియించి వచ్చితిక నాకాయాసమున్ దోచె నీ
వలపున్ గాదనలేను రెండు మెతుకుల్ వడ్డించవే చాలనన్
చెలి వడ్డించెను ప్రాణవల్లభునకున్ జింతాకులోఁ బ్రేముడిన్!

25. యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు, తిరుపతి
కలయందైనను విస్మరింపని మనోరాగమ్మునన్నేలు మం
జులతావిగ్రహు దంచితోత్కటగుణ స్తోముండు నా భర్త యం
చలినీలాలకవేణి దల్చి పలు మృష్టాన్నమ్ములన్ జేసి నె
చ్చెలి వడ్డించెను బ్రాణవల్లభునకున్ జింతాకులో బ్రేముడిన్

26. రంప సాయికుమార్ శర్మ, శ్రీకాకుళం
లలితంబైన మనోజ్ఞమైన కథలన్ లాలించి చెప్పంగ నే
కలితంబించుక లేని కృష్ణసఖులున్ గావింపగా నాటలన్
కలదో లేదని లేని వద్దనమునన్ క్రమంబుగా రాధ నె
చ్చెలి వడ్డించె ప్రాణ వల్లభునకున్ చింతాకులో ప్రేముడిన్.

27. రాకుమార, గోదావరిఖని
ఇలుతేడున్ వలె నిత్యమున్ సతికి హాయిన్ గూర్చు మర్యాదతో
కలనైనన్ పరకాంతలన్ గన తృణీకారంబు వాటిల్లగన్
వలపుప్పొంగెడి లేహ్యమున్ మిగుల సంపాదించి ముద్దార నె
చ్చెలి వడ్డించెను ప్రాణవల్లభునకున్ చింతాకులో ప్రేముడిన్.

28. రాయప్రోలు సీతారామశర్మ, భీమవరం
భళి భక్తిన్ విదురుండు మాధవునకున్ భక్షింపగా కోరి తొ
క్కలనిచ్చుం గతి ప్రేమయే మదిని పొంగన్ సిగ్గనుం దోడునై
కులుకుం దాచగ మోము త్రిప్పు కొనుచున్ కొంగడ్డముం జేసి నె
చ్చెలి వడ్డించెను ప్రాణవల్లభు నకున్జింతాకు లోప్రేముడిన్.

సమస్య (పూరణలు 15 అక్టోబరు 2025 లోపు పంపాలి)
గణపతి పుత్రి పెండ్లిఁ గనఁగాఁ జనుదెంచిరి మౌనులున్

దత్తపది

"ఉలి, కలి, చలి, బలి" పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ చంపకమాలలో కుంభవృష్టి వర్ణన.

1. అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి (అసనారె), హైదరాబాదు
ఉలికిపడంగ రైతు లనుయోగము నాశనమయ్యె, వాయు సం
కలితపు కుంభ వర్షములు క్రన్నన పంటల రాల్చి కూల్చగా
చలితము లయ్యె దేహములు సల్పిన కష్టము నష్ట మెంచుచున్
బలియగు చున్న రైతు ఋణబాధల కేకలు మిన్నుముట్టెగా.

2. కటకం సూర్య నారాయణ మూర్తి
ఉలికిపడంగ లోకము మహోగ్ర వహంత విభీషణంబుగా
కలి వికటాట్టహాసమన గర్జనలన్ భయకంపితంబుగా
చలిమలలన్ కకావికలు సల్ప హిమాని మహాప్రవాహముల్
బలిగొనె వేల ప్రాణములు వ్యాకులితంబుగ కుంభవృష్టియే

3. కవుతా రామకృష్ణ
ఉలికిపడంగ దేశజను, లుర్విని దాకుచు వాడి వానచి
న్కు లురకలెత్తి యేరులయి క్రూరముగాఁ బెకలించె నిండ్లు వా
డల, నచలించె దైవ మన డాంబికజీవనశైలిఁ గాంచి, జీ
వులు వెతలొంద నంబలికి, వ్యోమగతాంబుదకుంభవృష్టిలోన్.

4. కృష్ణ విరజ
ఉలికి పడెన్ త్రిలోకములు హోరుగ జారెడి వృష్టి చేఁ గనన్,
గలి కబళించె నా కలి విఘాతముచే భువి నెల్ల ముంచుచున్.
చలితము కాగ భూమి కడు జంకుచు వేడుకొనంగ, వేగమా
బలిమిని నడ్డగించగ భవానికి మ్రొక్కిరి వేల్పు లెల్లరున్.

5. గుంటి విష్ణుమూర్తి, వరంగల్
విడువని వానతో నులికి వేగిరపాటున నిల్చి చూడ దం
దడి బెకలించె నా వరద దారిన నున్న వనంబు గుట్టలన్
పిడుగులు రాళ్ళతో మిగుల వేగముతో చలియించె నిండ్లు నా
జడి బలియన్ దటాకమున ఛత్రముఁబట్టిన యట్లు తోచెడిన్.

6. గుండా వేంకట సుబ్బ సహదేవుడు, ప్రొద్దుటూరు
ఉలిపిరి బోలుచున్ జినుకునూపిరిదీయును కుంభవృష్టిమై!
కలిగిన దేదియున్ లయము గాకను నిల్వదనాథకున్ జలా
చలి చలి వ్యాఘ్రమౌచుఁ గసి చంపు నిరాశ్రయులైనవారి! నం
బలియును లేక నీల్గఁ గనవా! గిరిధారిగ నందనందనా!

7. గుఱ్ఱం మల్లేశం
ఉలికిన మేఘ మాలికలు నూపిరి నాగుచు బ్రద్దలా యెగన్
కలిగెను కుంభ వృష్టియును కట్టలు డ్రెంపెన్ వాగువంకలన్
చలియును భీకరంబవుచు చల్లగ నీరము గడ్డకట్టగన్
బలిగొనె జంతుజాలమును బందిగ జేయుచు జంపి వేయగన్.

8. గోవిందు గోవర్ధన్, పాలెం
ఉలికి వడంకె పట్టణము నూపిరి సల్పని వర్షధారచే
కలిసెను మురుగ్గునీటినిది కాల్వలు వాగులు పొంగి పొర్లుచున్
చలిగొని పిల్ల పాపలిక సత్తువ లేకను దుఃఖ వారిధిన్
బలిగొన జేసె ప్రాణముల బావురు శబ్దము మిన్ను ముట్టగాన్.

9. జి. లింగేశ్వర శర్మ, సిద్దిపేట
ఉలికి పడంగ మేఘములు నుజ్వలమై మిరుమిట్లు గొల్పుచున్
కలిగిన కుంభవృష్టికిని కట్టలు తెంచుకొనొక్కసారిగా
చలితమునై భయోత్పతము చండ ప్రచండపువార్షధారలే
బలి గొనె వేగ ప్రాణములువాగులువంకలుపొంగిపొర్లియున్

10. డా. జంధ్యాల సుబ్బలక్ష్మి, హైదరాబాదు
ఉలికిపడంగ లోకము మహోద్ధతధారల వర్షమందునన్
కలిగిన చెట్టుచేమలు చికాకున నౌదలలెల్ల వంచ చం
చలితశతహ్రదల్ వెలుగు సాయము నీయగ పిల్ల పాప లం
బలికిని నోచకుంట కడు భాగ్యము నయ్యను కుంభవృష్టిలో.

11. డా. బోరెల్లి హర్ష, కర్నూలు
ఉలికినమొబ్బుగుబ్బలకునుబ్బరమూరటగూర్చనింపుల
కృలివలె మిన్నువీడిమన కల్లములందుననాటలాడను
చ్చలితము లయ్యెనేటిదరి చాలినదారులునీటమున్గను
బ్బలిదొనమయ్యెనూరిగతి వానల బల్మికి వాడవాడకున్.

12. డా. రఘుపతి శాస్త్రుల, హైదరాబాద్
ఉలికి పడంగ పట్టణము హోయని వేదన నందుచున్ జనుల్
కలిగిన వస్తుజాలమును కైకొని బాలలతో హడావిడిన్
చలిమల వాని అల్లుని దెసం గని మ్రొక్కుచు ఇండ్లు వీడి అం
బలియును త్రాగ నెన్నకయు వంతల నొందిరి కుంభవృష్టికిన్!

13. డా. రామడుగు వేంకటేశ్వర శర్మ, హైదరాబాద్
ఉలికి పడంగ నెల్లరును నుర్ములు, మెర్ములు ముమ్మరించెఁ జు
క్కలివె! కనంబడంగను దిగాలుగ నుండెను గర్షకాళిబీ సం
చలియింపఁగా భయ విచారమె పో! కఱవాయెఁ గాదె! యం
బలి ప్రళయంకరంబయిన మంటికి మింటికి నేక ధారలో.

14. డా. వరలక్ష్మి హరవే, బెంగుళూరు
కలి సమయంబు మేటిగద కష్టములే మనుజాతికెల్లెడన్
ఉలితను చేతపట్టి మరి యూపున చెక్కెను వృష్టి దైవమే
చలి వణికించె,మెండుగను జారిన చిన్కులు కుండపోతలై
నిల బలి నీయ కోరెరయ నిల్వగ వానలు దైవ సంతునున్.

15. పి.యల్. నాగేశ్వర రావు, హైదరాబాదు
ఉలికిరి వాయనాడు ప్రజలోర్వగ లేకయె కుంభవృష్టితోన్
విలవిల లాడిరాకలికి, విచ్ఛితి యయ్యెను సర్వసంపదల్,

బలిమిని గోలుపోవ వడి బ్రేత వనంబయి నొక్కపెట్టునన్
జలిత మనస్కులైరి ఘన సంస్కృతి గల్గిన కేరళీయులున్!!

16. పెనుకొండ రామబ్రహ్మం, బెంగుళూరు
ఉలికి పడంగ గర్జనల నుత్తర కార్తె తటిత్తు లెక్కువై
కలియఁగఁ గారుమబ్బులటు క్రమ్మఁగఁ జీకటి యంధకారమై
చలితముఁ జెంద మానవులు క్షామము తగ్గఁగ రైతు మెచ్చఁగన్
బలిమిని కుండ పోతగను వర్షము రాయల సీమనన్ బడున్.

17. మంకు శ్రీను, కొప్పఱ్ఱు, ప.గో.జిల్లా
ఉలికిపడెన్ జనప్రతతి ఉజ్జ్వల వర్షము తాండవించె ఈ
కలియుగమంతమొంద విధిగా తలపోసెనొ యేమొ రేగిబీ సం
చలితమహోగ్ర ధారలవి సర్వము నాశమొనర్చెనొక్కొ అం
బలికయి అఱ్ఱు సాచిన యభాగ్యుల నోమవలెన్ దయాళువుల్.

18. మాచవోలు శ్రీధరరావు, హైదరాబాద్
ఉలిపి యొకండు మీదపడ నోడెడి కైవడి నీరు వెల్లువై
కలిసెను కాలిబాటలను గాంచుచు! క్షుత్తును గెల్వ శక్తికై
చలిది భుజించి కొల్వునకు సాగుచు నడ్డగ కుంభవృష్టినిన్
బలిమి యొకింత లేని చిరు పల్లె నివాసి వహించె దైన్యమున్.

19. మాడుగులమురళీధరశర్మ, సిద్దిపేట/కాళేశ్వరం
ఉలికి పడంగ మత్తడులు నుర్లుచు పొంగుచు పొర్లు రీతిలోన్!
కలిగిన కుంభవృష్టి కడగండ్లుగ భూతపిశాచ ఘోషలై!
చలిత భయాన కోజ్వలిత చంచల నృత్య కరాళ తాండవో!
ధ్బలి తల నానుచుండు గద భాసుర భీకర బ్రహ్మసృష్టిలోన్!

20. మాతా గంగాభవాని శాంకరీదేవి, విశాఖపట్నం
ఉలికి పడంగ మేఘముల నుత్సహగర్జన కేళి గాంచగన్
కలిగెను ప్రాంతమంతయు కకావికలంబయి కుంభవృష్టి తో
చలి విపరీతమై ధరను సాగగ దుర్భర శీతలంబునన్
బలి యగు జంతుదండులతి బాధను బొందగ కాననమ్మునన్.

21. మార్తాటి ఈశ్వరీ గోపాల రావు, సింగరాయకొండ
ఉలికిపడంగ నొక్క పిడుగుజ్వల తేజముతోడ నార్భటిన్
కలిగినిమేషమున్ గడువ కారుమొయిళ్ళురుకన్ ధరిత్రి సం
చలితమునౌ తెరంగు వడి జల్లులు రా తెరపీయనందు కం
బలిఁగుడవంగవచ్చె నొక వాసరమంతయు కుంభవృష్టిచేన్.

22. యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు, తిరుపతి
ఉలికిపడెన్ జగమ్ములు పయోదములాకస మావరింప సం
కలిత మహాంధతావిధిని, గాఢతరాశనిపాతయుక్తమై
చలిత మరుత్సహాయమున శాణిత బంధుర బాణఘాతమౌ
బలిమి గతిన్ జెలంగె బహుబాధల గూర్చుచు కుంభవృష్టియే!

23. రంప సాయికుమార్ శర్మ, శ్రీకాకుళం
ఉలికిపడంగ లోకములు నూహల మించిన మేఘగర్జనల్
కలిగిన భీతి హెచ్చునటు కాంచగలేనటు కారుచీకటిన్
చలిత మహోగ్ర వాయువున జల్లుగ నేలను కుంభవృష్టిగా
బలిమిని జూపెగా వరుణు పాపము! పౌరుల బాధవెట్టుచున్.

24. రాకుమార, గోదావరిఖని
ఉలివరమొంది భూధరమునుల్కిపడంగను వృక్షరాజ సం
కలితములెల్ల కూలుచు విఘాతము గూర్చ నొకింతయైన బ
చ్చలి కనరాక దేహము వశంబును దప్పె రవంతయైన అం
బలికిని నోచుకోని దురవస్థకు నీడ్చెను కుంభవృష్టియున్.

25. విమల ఆర్యసోమయాజుల, బెంగుళూరు
ఉలికిపడంగఁ జేసె కడు నుద్ధతి తోడను కుంభవృష్టి యౌ
జలమును గాంచి కే"కలి" డు సర్వము నీటమునింగిపోవగా
కలవరమొందు నాప్రజల కష్టము గాంచి" చలిం" చిరందరున్
నిలుకడ లేకనే ప్ర"బలి" నింగియు నేలయు నేకమవ్వగా.

26. విరించి, హైదరాబాదు
కలియుగమంతమౌనొమరి, ఖాంకుడు నింగిని కానరాడయెన్
చలియె వికట్టహాసమును సల్పుచు నుండగ భూతలమ్మునే
బలిగొన నెంచెనో శరధిపాలకుడాగ్రహమందు నంచు తా
నులికిపడెన్ ధరిత్రియె మహోగ్రపు వర్షము గాంచి భీతితో.

27. వెలగపూడి భారతి
ఉలికి పడెన్ జగంబులు మహోగ్రతమంబగు వర్షధారతో
కలిమి జెడెన్ పొలంబులు కకావికలంబయి నీట మున్గగా
చలికి వడంకు వృద్ధులఁ విచారణ సేయగలేని బిడ్డలున్
బలిమినిడంగ పాలకులు వత్తురటంచును వేచి చూడగన్.

28. శంకర్ జీ డబ్బీకార్, ఇబ్రాహీంపట్నం
ఉలికిపడంగ మేఘములు నుర్వికి నింగికి బాటగట్టెనో
కలిగిన నీటిబల్మి ధరకందగ జేయ వదాన్యు డయ్యెనో
చలిమల క్రాగిసాగినటు సత్వము జూపుచు సత్వరమ్ము నా
బలియుడు దాడిజేసె వడి శ్వాసిపయిన్ బిడుగో ముదంబొకో?

29. శ్రీనివాస్ లింగం, దుబాయి
ఉలికిపడెన్ జనమ్ము! మది యుల్లసమంతయు నీరు గారె, నా
కలి కలిగేను పిల్లలకు, గాఢత కల్గిన మబ్బుఁ జూచుచున్
దలపున బాధతో విచలితంబయె గ్రామము కుంభవృష్టినిన్
బలి కయి పుట్టినట్టి మనవామనమూర్తియె రక్షనిచ్చులే.

దత్తపది (పూరణలు 15 అక్టోబరు 2025 లోపు పంపాలి)
జనవరి - మార్చి - మే - జులై
ఈ పదాలను ప్రయోగిస్తూ రామాయణార్థంలో తేటగీతి పద్యాన్ని వ్రాయండి.

పద్యకవిత్వము సాధుప్రయోగాలు - 1

- 'అష్టావధాని' చిటితోటి విజయకుమార్



తెలుగులో పద్యాలు క్రొత్తగా వ్రాస్తున్న వారి కోసం ఈ వ్యాసం. సంస్కృతవ్యాకరణంతో అంతగా పరిచయం లేకున్నా తత్సమ శబ్దాలు, తత్సమశబ్దాలతో కూడిన సమాసాలు ప్రయోగిస్తున్నప్పుడు కొన్ని తప్పులు దొర్లే అవకాశం ఉంది. అలాంటి కొన్ని అసాధురూపాలను ఈ వ్యాసాలలో వివరిస్తున్నాను.

ప్రాధాన్యత

ప్రధాన అనే శబ్దంపై మూడు తద్ధిత ప్రత్యయాలు చూద్దాం.

ప్రధాన + త్వ = ప్రధానత్వ (తెలుగులో ప్రధానత్వం)

ప్రధాన + తల్ = ప్రధానతా(తెలుగులో ప్రధానత)

ప్రధాన + ష్య = ప్రాధాన్య (తెలుగులో ప్రాధాన్యం)

సంస్కృతంలో ఒక తద్ధితాంత రూపంపై మరో తద్ధిత ప్రత్యయం రాదు. కానీ చాలామంది చేసే పొరపాటు ఏమంటే ప్రాధాన్య అనే ష్య ప్రత్యయంతో ముగిసిన పదంపై తల్ ప్రత్యయం వేసి ప్రాధాన్యత అంటారు. ఈ రూపం వచ్చే అవకాశం లేనందున పైన చూపిన మూడు రూపాలలో ఏదో ఒకటి ప్రయోగించాలి.

ఇలాంటివే మరి కొన్ని శబ్దాలు.

వైశిష్ట్యత (తప్పు) - వైశిష్ట్యము / విశిష్టత / విశిష్టత్వం (ఒప్పు)

కాఠిన్యత (తప్పు) - కాఠిన్యము / కఠినత / కఠినత్వం (ఒప్పు)

నైపుణ్యత (తప్పు) - నైపుణ్యము / నిపుణత / నిపుణత్వం (ఒప్పు)

ప్రాముఖ్యత (తప్పు) - ప్రాముఖ్యము/ప్రముఖత/ ప్రముఖత్వం (ఒప్పు)

ప్రామాణ్యత (తప్పు) - ప్రామాణ్యము/ప్రమాణత/ప్రమాణత్వం (ఒప్పు)

మాధుర్యత(తప్పు) - మాధుర్యము/మధురత/మధురత్వం (ఒప్పు)

హంతక!

సంబోధనలో హంతక! అని కొంతమంది ప్రయోగిస్తుంటారు. సంస్కృతంలో హంతక అనే పదం లేదు. హన్ చంపు అనే ధాతువుపై కర్తరిలో తృచ్ ప్రత్యయం వచ్చినప్పుడు హంతృ అనే మూలరూపం వస్తుంది. చంపువాడు అని అర్థం. దీనికి ప్రథమా ఏకవచనం పురుషుడు అయితే హంత, స్త్రీ అయితే హంత్రి. కానీ హంతకుడు, హంతకురాలు అని అనకూడదు. హన్ = చంపు అనే ధాతువుపై ణ్వుల్ ప్రత్యయం వచ్చినప్పుడు ఘాతక అనే రూపం వస్తుంది కనుక ఘాతకుడు, ఘాతకురాలు అన వచ్చు, సంబోధనలో ఘాతక! అనవచ్చు.

తక్షణం

తత్ + క్షణం = జశ్త్వం, చర్త్వం అనే రెండు సంధులు వచ్చాక తత్ క్షణం = తత్క్షణం అవుతుంది. దీనికి ఆ క్షణంలో లేదా వెంటనే అని అర్థం చాలామంది తక్షణం అని వ్రాస్తుంటారు. తక్షణం అంటే చెక్కడం అని అర్థం.

హత్య

సమాసం చేయకుండా విడిగా "హత్య" అనే పదాన్ని ప్రయోగించకూడదు. భ్రూణహత్య, శిశుహత్య, స్త్రీహత్య, గోహత్య మొదలైన పదాలు సమాసంలో ఉన్నందున సాధురూపాలు.

జాగృతి

మెలకువ, జాగరూకత అనే అర్థంలో జాగృతి అనే పదాన్ని ప్రయోగిస్తున్నాము. మహామహోపాధ్యాయ శ్రీ రవ్వా శ్రీహరి గారి తెలుగు తెలుగు నిఘంటువులో కూడా ఈ పదం ఉంది. కానీ జాగృ + క్త = జాగృత అవుతుంది కానీ జాగృతి కాదు.

సన్యాసి

సన్యాసం స్వీకరించిన వాడు అనే అర్థంలో సన్యాసి అనే పదం వాడుకలో ఉంది. సం + న్యాసి = సంన్యాసి అవుతుంది. కనుక సన్యాసి అనకూడదు. దీనికి వికృతి సన్నాసి.

అనుకూలవతి

అనకూలవతి అంటే అనుకూలురు కలిగిన స్త్రీ అని అర్థం. అనుకూలంగా ఉండే స్త్రీని అనుకూల అనాలి.

ఈశాన్యం

ఈశ్ అనే ధాతువుపై తాచ్ఛీల్యార్థంలో చానశ్ అనే కృదంత ప్రత్యయం రాగా ఈశాన = శివుడు అనే రూపం వస్తుంది. శివునకు సంబంధించినది అనే అర్థంలో ఈశాన శబ్దంపై అణ్ అనే తద్ధిత ప్రత్యయం వచ్చినప్పుడు ఐశాన లేదా ఐశాని అనే రూపాలు వస్తాయి. శివునకు సంబంధించినది కనుక తూర్పు ఉత్తరాలకు మధ్య దిక్కును ఐశాని అనాలి. కానీ ఈశాన్యం అనే పదం వాడుకలో విస్తృతంగా ఉంది కనుక ఈ పదాన్ని ప్రయోగించవచ్చని నా వ్యక్తిగత అభిప్రాయం. ఇలాగే వృద్ధత్వం, వార్ధకత అనాలి కానీ వార్ధక్యం అనకూడదు. కానీ ఈ పదం కూడా విస్తృతంగా వాడుకలో ఉన్నది కనుక పెద్దలు ఇలాంటి పదాల ప్రయోగం గురించి ఆలోచించాలి.

కొన్ని శబ్ద, సంధి, సమాస దోషాలను తదుపరి వ్యాసంలో చూద్దాం.

(సశేషం)

ఒక భాషకు అనేక రూపాలు ఉంటాయి. అందులో ప్రమాణ రూపాలు, అప్రమాణ రూపాలు ఉంటాయి. నిజానికి ఈ అప్రమాణరూపాలు అంటే వ్యాకరణ రూపాలు సాధించుకున్నాక ....అలా సాధించుకోకుండా జనుల వ్యవహారంలో మిగిలిపోయినవి అన్నమాట. పదాలు పుట్టడం జనవ్యవహారం లోనే. అవి క్రమక్రమంగా శుద్ధి చేసుకోబడి శిష్టప్రయోగాలకు ఎక్కుతాయి.కొన్ని అలా జన వ్యవహారంలో ఉండిపోతాయి. జనుల వాడుకలో ఉన్న పదాలు కూడా చాలావరకు శిష్టంగానే ఉంటాయి. కొన్ని కొన్ని నుడులు జానపదాలలో నానుతూ ఉండడంవల్ల భాషాశాస్త్ర సూత్రాలలో చెప్పబడిన రీతిగా అర్థం మార్పు, అక్షరం మార్పు, అక్షరాల తారుమారు ఇలా ఎన్నో రకాలుగా మార్పులు చెందుతూ ఉంటాయి. భాష పరంగా ఇవి సహజ పరిణామాలు.



ఎన్.సిహెచ్. చక్రవర్తి

ఈ అన్ని మార్పులవల్ల కొన్ని గ్రామ్యాలు అనే ముద్ర వేసుకుని ఉంటాయి. గ్రామ్యాలు అంటే అవి ప్రమాణ కవిత్వంలో వాడకానికి పనికిరావు అని. కానీ వ్యాకరణకారులు ఈ గ్రామ్య పదాలు కూడా ఆయా జాతి వర్ణనల సందర్భంగా వాడవచ్చు అన్నారు.(గ్రామ్యంబు తత్తజ్జాతి వర్ణనంబునందగు.. ప్రౌ.వ్యా.)అంతవరకే దాని పరిమితి.

మన తెలుగు సాహిత్యంలో ఉన్న అనేక రూపాలలో ఈ వ్యవహార, గ్రామ్య పదాలు సందర్భానుసారంగా వాడుకోవచ్చు. వాడుతున్నారు కూడా. కానీ తెలుగు సాహిత్యంలో అతి గొప్పదైన పద్యం అనే రూపంలో ఈ విధంగా లోకంలో వాడుకలో ఉన్న వ్యవహార పదాలనూ లేదా గ్రామ్య పదాలనూ యథేచ్ఛగా వాడడానికి లేదు. అలా వాడితే ఏమిటి?? అంటే ఎవరు వాడుకున్నా ఎవరికీ అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదు. కానీ మన పద్య ప్రత్యేకతను నిలుపుకోవాలంటే పద్య సౌందర్యాన్ని కాపాడుకోవాలంటే కొన్ని పాటించక తప్పదని విజ్ఞులు, కవికోవిదులు, లాక్షణికులు అంటారు. వీటినే సంకెళ్లుగా కొందరు భావిస్తూ ఉంటారు. పద్యం అంటే అసలే గణాలు, యతులు, ప్రాసలతో సతమతం అవుతూ ఉంటే మళ్లీ ఈ భాషా నిబంధనలు ఏమిటి?? ఈ సంధులు ఏమిటి?? సమాసాలు ఏమిటి?? మరిన్ని సంకెళ్లా?? అని ఆధునికులు కొందరు అడుగుతూ ఉంటారు. మన పద్య ప్రత్యేకతను కాపాడు కోవాలంటే కొన్ని పాటించక తప్పదు. ఏదీ పాటించనక్కర లేనపుడు అసలు ఛందో నియమాలూ గణాలూ ఏవీ పాటించాల్సిన అవసరం లేదు. అప్పుడు హాయిగా మిగతా కవితా రూపాలు బోలెడు ఉన్నాయి...అవి వ్రాసుకోవచ్చు. పద్యాన్నే ఎందుకు ఎంచుకోవాలి?? పద్యం వ్రాస్తాం అనుకున్నప్పుడు ఆయా లక్షణాలు తెలుసుకుని, అవి పాటించాలి కదా అనేది స్థూలంగా సమ్మతించే విషయం. విదేశాలు వెళ్ళాలనుకున్నప్పుడు పాస్పోర్ట్, వీసా వంటివి తీసుకోక తప్పదు కదా!!తీసుకోకుండా వేరే దేశం పోవడం కుదరదు కదా!!

“ప్రయోగ శరణం వ్యాకరణం అని పెద్దలే అన్నాక అసలు ఆమోదించడానికీ ఆమోదించకపోవడానికీ మధ్యలో ఈ పెద్దలు ఎవరూ?? అంటే... అది సబబే అన్నట్టు ఉంటుంది కానీ...ఒక ఊరికి ఒక భాష, ఒక యాస అన్నట్టుగా తయారైన నేటి కాలంలో ఎవరికి ఇష్టంవచ్చినట్టు వారు వ్రాసుకుంటూ “ప్రయోగశరణం” అనే మంత్రాన్ని వల్లిస్తే కుదరదు. ఎందుకంటే ప్రాచీన కాలంలో భాషా వ్యాకరణాది అనేక శాస్త్రాలు నేర్చినవారే కావ్యాలు వ్రాసేవారు కనుక వారు స్వతంత్రించి ఎక్కడైనా ఏదైనా విశేష ప్రయోగం చేసినా అది ఆమోదయోగ్య మవుతుంది. అటువంటి శాస్త్ర సాధనాసంపత్తి ఏమీ అనుకుంటూ వ్రాస్తున్న ఈ రోజుల్లో ఆ ప్రాతకాలపుమాట చెల్లదు.ఆపై ఎవరి విజ్ఞత వారిది..ఎవరి స్వేచ్ఛ వారిది.

ఇంత ఉపోద్ఘాతమూ ఎందుకంటే పద్యం శుద్ధంగా వ్రాయగోరినవారు....అనేక కారణాల వలన శాస్త్రకావ్యాది అభ్యసనం పూర్వ తరాల వలె చేయకపోయినా ... వ్యాకరణ పరంగా సంధి, సమాసం మొదలైన వాటి విషయాలలో పరిజ్ఞానం తగినంత ఉండితీరాలి. పద్యం ఒక విన్యాసంగా ఉన్న అవధాన సాహిత్య క్రీడ సాధన చేసి, ప్రదర్శించేవారికి వ్యాకరణ పరిజ్ఞానం చాలా అవసరం..వ్యాకరణ పరంగా శుద్ధంగా లేకుంటే పద్యాన్ని పండితులు, విజ్ఞులు మెచ్చరు. వ్యాకరణ పరిజ్ఞానం బాగా ఉన్న వారికి అవధానాలలో ఈ పరిజ్ఞానం ఎన్నో విధాలుగా అందమైన విన్యాసాలకు కూడా ఉపయోగపడు తుందని గ్రహించాలి. ఏతత్ కారణంగా ఇప్పుడు ఇక్కడ కొంత వ్యాకరణం...

“తెలుగునకు కల వ్యాకరణ దీపం చిన్నది” అని పెద్దలు అన్నారు. అందులోనూ మరల కొన్నికొన్ని చోట్ల వివాదాలు ఉన్నాయి. ఇంకా అనేకం మిగిలిపోయే ఉన్నాయి. అయినా ప్రస్తుతానికి ఏదో ఒక ఆధారం కావాలి కనుక చిన్నయసూరిగారి బాలవ్యాకరణాన్ని ఊతగాఁగొని అవసరమైనచోట్ల బహుజనపల్లి వారి ప్రౌఢాన్ని సాయంగా తీసుకుని కొన్నికొన్ని వ్యాకరణ విషయాలు వచ్చే సంచికల్లో చెప్పుకుందాం. **(సశేషం)**

పద్యపరిమళం

ఉమా సహస్రం

- చేపూరి శ్రీరాం

అవధాన పుష్కరిణి పాఠకులకు నమస్సులు. ఈ శీర్షికలో తెలుగు పద్యాలలోని సొబగును, శ్లేషార్థాలంకారాలను, రహస్యార్థాలను, ప్రతిపదార్థాలను, విశిష్ట భావనలను, విశ్లేషణలను తరచి చూసి పద్యం అంతరాంతరవీక్షణంతో పాఠకులకు అందించే లక్ష్యంతో ఈ శీర్షిక నిర్వహించబడాలని నిర్వాహకుల కోరిక. ఇవన్నీ ఏక కాలంలో ఒకే పద్యానికి సాధ్యం కాకపోవచ్చు. ఐతే పద్య నేపథ్యాన్ని అనుసరించి నేను చదివినవీ, విన్నవి, సేకరించినవీ, స్వంతంగా విశ్లేషణ చేసినవీ అన్నీ కలగలిపి ఉత్తమమైన భావార్థాలు ప్రకటించే ప్రయత్నం చేస్తాను.

మరి కొద్ది రోజుల్లో అమ్మవారి నవరాత్రుల సంబరాలు జరుగబోతున్నాయి కాబట్టి ఈ పక్షం అమ్మ వారి తాత్విక చింతనకు సంబంధించిన ఒక పద్యం తో మొదలు పెడదాం.

ఒనరననాద్యనంత యగుచుండును గాక భవాని యయ్యె, 'ఉ'
యన శివుడర్థ,మందొదవు నట్టి జగంబుల 'మా'ఖ్య గొల్చుటన్
జన 'నుమ'నా,రసంబయి వ శాహ్వయ ధాతు సము శ్యమానయై
తనరు 'శివాఖ్య'నిట్లు త్రివిధంబుగ తచ్ఛ్రుతి సన్నుతంబగున్

ఈశ్వరుని పరచితి భవాని, ఉమ,శివ అను నామ త్రయమున చెప్పబడునని వాని నిర్వచనము వివరించ బడుతున్న ఈ పద్యం శ్రీ వసిష్ఠ కావ్యకంఠ గణపతి మహాముని విరచితమైన సంస్కృత ఉమాసహస్రం యొక్క ఆంధ్రీకృత పద్యం.ఇది పంతుల లక్ష్మీ నారాయణ గారిచే ఆంధ్రీకృతం చేయబడింది మరియు విశేష భావప్రకాశ వ్యాఖ్య అందించబడింది.

కావ్యకంఠబిరుదాంకితుడు, సాక్షాత్ గణపత్యంశ సంభూతుడు, మునివరేణ్యుడు,మంత్రద్రష్ట,కవికుంజరులు ఐన శ్రీ వాసిష్ఠ గణపతి ముని అపురూపసృష్టి ఉమాసహస్రం. ఇది స్తుతివాఙ్మయంలో అత్యున్నత స్థానం అధిష్టించింది. ఉమా సహస్రం లో వేద, ఉపనిషత్, ఆగమ,తంత్ర శాస్త్ర రహస్యాలు నిక్షిప్తమై ఉన్నాయి.

రమణమహర్షుల అంతేవాసి ఐన గణపతి ముని ఉమా సహస్ర కావ్యరచన ఇరవైరోజులలోపూర్తి చేయాలని దీక్ష బూనారు. ఈ విషయం శ్రీ రమణులకు చెప్పి 20-11-1907 మంగళ వారం ఉమా సహస్ర స్తబక బంధదీక్ష బూనారు. ప్రతిరోజూ సాయంత్రం రమణమహర్షి గణపతి మహాముని ఆశ్రమ గుహకు వచ్చి ఆ రోజు వ్రాయబడిన ఘట్టం విని కాసేపు కూర్చుండి వెళ్ళేవాడు. నాలుగైదు రోజుల్లో దీక్ష ముగుస్తుందనగా కుడి చేతి బొటన వ్రేలుపై గోరు చుట్టు వంటి పుండు ఏర్పడి వ్రాయడం సాధ్యం కాలేదు. ఇరవైవ రోజు వరకూ ఇదే పరిస్థితి. చివరకు ఆ రోజు సాయంత్రం శిష్యులు వచ్చి వేదాంతాగమరహస్యాలతో కూడిన ఈ పుస్తకరచన ఆగిపోకూడదని ఆశువుగా చెప్పుమని కోరగా గణపతి మహాముని "భువనేశ్వరీ మధు కటాక్ష మును,తద్వారమున కావ్యకంఠ బిరుదము ప్రాప్తింపజేసిన ఆశుకవితా ప్రజ్ఞను చూపించుకోవ డానికే అమ్మ ఈ పరీక్ష పెట్టిందని భావించి ఐదుగురు శిష్యులను రాత్రి ఎనిమిది గంటలకు రమ్మని చెప్పి పూర్తి చేయవలసిన పది స్తబకములు (250శ్లోకములు) ఒకేసారి ఐదుగురికి వేరువేరు వృత్తాలు ఆశువుగా చెబుతూ రెండు వందల నిమిషాలలో ముగించాడు. అంతసేపు తన వెనుకనే యోగ ముద్రలో ఉన్న రమణ మహర్షులు సమాధిస్థితి నుండి బయటికి వచ్చి... "నాతో చెప్పబడినదంతయు వ్రాసుకుంటిరా"అని అడిగాడు, దానికి గణపతి మహాముని తాననుకున్న గుహేశతత్త్వం శ్రీ రమణుల యందు విశదమైనదని సంతోషించి ఔనని ప్రత్యుత్తరమిచ్చారు. ఈవిధంగా శ్రీరమణ, గణపతులమధ్య జరిగిన శక్తిప్రవాహం ఉమాసహస్రంగా రూపందాల్చింది. ఈ శక్తిప్రవాహం కుండలినిగా కొన్ని స్తబకాలలో వ్యక్తపరచబడింది. జ్యోతిశ్శాస్త్ర, మంత్రశాస్త్ర ఆయుర్వేద రహస్యాలు ఎన్నో ఇందులో నిబద్ధించబడ్డాయి. సాహిత్య దర్పణ గ్రంథాలలో, అలంకార శాస్త్రాలలో చెప్పబడనటువంటి ఎన్నోసాహిత్యప్రయోగాలు కూడా ఇందులో చోటుచేసుకున్నాయి.

ఇక పద్యతాత్త్వికత పరిశీలిద్దాం, ఆది-అంతము లేకుండుట వల్ల ఈ మహాశక్తి "భవతీతి భవాని" ఉన్నది కావున భవాని.

ఉ అను శబ్దమునకు శివుడను అర్థం కలదు. కావున 'ఉ'పద వాచ్యుడగు శివునినుండి పుట్టుచున్న లోకములను 'మాతీతిమా' కొలుచునది అను వ్యుత్పత్తి చేత మహాశక్తి ఉమ యగుచున్నది. కొలువబడేది పరిమితం.అనగా అపరిమితమై,ఈశ్వరుని నుండి పుట్టుచున్న లోకాలన్నియు జగన్మాత దగ్గర మితమై కొలువబడుచున్నాయి. ఆశ్చర్యంగా కాళిదాసు మాత్రం "ఉమేతి మాత్రా తపసో నిషిద్ధా పశ్చాదుమాఖ్యాం సుముఖీజగామ" ఉ=అమ్మాయీ, మ=తపము చేయవద్దు అని పార్వతి తల్లిచే పిలవబడి ఉమగా మారిందని తెలిపారు. ఆంధ్రభారతి కూడా ఇదే వ్యుత్పత్తి పేర్కొంది. లోకులందరి చేత రస స్వరూపిణి నగు ఈమె "ఉశ్యమాన"= కోరబడుచున్నది యగుచుండుట చేత శివ అని చెప్పబడుచున్నది

ఇట్లు కామార్థకమగు వశ ధాతువుచే గోరబడుచున్న ఆనంద స్వరూపిణి ఐన మహాశక్తి వశ అను ధాతువు లోని అక్షరముల మార్పు వలన శివ అని చెప్పబడుచున్నది.

వేదాలలో ఏది గాయత్రిగా చెప్పబడిందో ఆమెయే ఉపనిషత్తులలో ఉమగా వర్ణింపబడినది.కేనోపనిషత్తులో ఇంద్రునికి, హైమావతికి జరిగిన చర్చ చిత్రమైనది.అక్కడ ఇంద్రునికి ఉమా దర్శనమవుతుంది.ఇక్కడ కావ్యకంఠ గణపతి మహామునికి కూడా ఉమ దర్శనం లభిస్తుంది.

కావ్యదోషాలు

డా॥ సూరం శ్రీనివాసులు

ఏ వస్తువులోనైనా, ఏ పనిలోనైనా విశేషం లేకపోయినా ఫరవాలేదు కానీ వికారం లేకుండా కనిపించాలి, ప్రత్యేకించి ఆ వికారం అభిలషితమైతే తప్ప. ఎందుకంటే హాస్యాన్ని కలగించాలన్నా మూర్ఖత్వాన్ని ప్రదర్శించాలన్నా వికారం – వికృతి – అవసరమవుతుంది. అటువంటి అనివార్యత ఏర్పడితే తప్ప ఇతరత్ర వికారం విషాదహేతువే. కావ్యనిర్మాణంలో లేదా పద్యనిర్మాణంలో ఈ వికారం కనిపిస్తే అది సౌందర్యాన్ని భంగపరుస్తుంది. కావ్యం అందంగా వున్నట్లనిపించినా ఒక్క దోషం దాన్ని భంగపరుస్తుంది! శరీరం అందంగా వున్నా ఒక కుష్ఠుపుమచ్చ దాన్ని భంగపరుస్తుంది గదా! అందుకని కావ్యనిర్మాణంలో స్వల్పదోషానికి కూడా అవకాశముండదనీ దాన్ని ఉపేక్షించ కూడదనీ ప్రాచీనాలంకారికుడు దండి కావ్యాదర్శంలో ప్రకటించాడు.



తదల్పమపి నోపేక్ష్యం కావ్యే దుష్టం కథంచన ।
స్యాద్వపుః సుందరమపి శ్విత్రేణైకేన దుర్భగమ్ ॥

(కావ్యా దర్శః – 1/7)

అయితే కావ్య / పద్య నిర్మాణానికి తగిన ప్రతిభ మనలో నిండుగా పొడమినపుడు ఆ ప్రతిభయే అంతా సాధించి పెడుతుంది. కాబట్టి తప్పు దొర్లితే మాత్రం తప్పేముంది? ఆశించేది లోకకళ్యాణమే గదా అని సర్ది చెప్పుకొనే ప్రయత్నం చేయవచ్చు. అందుకే వ్యుత్పత్తి కూడా అవసరమే నని పెద్దలు చెప్పింది. వ్యుత్పత్తి కొరవడితే లోకమూ అర్థం కాదు, లోక కల్యాణమూ అర్థం కాదు. పామరులు లోకం కోసం ప్రయత్నించ గూడదూ అని అడగవచ్చు. నిజమే. ప్రయత్నించవచ్చు. అయితే కావ్యాలు వ్రాసి కాదు. వారికి స్వతః వారి దారి వారికి తెలుస్తుంది. మిగిలిన వాళ్ళమే కవిత్వాలూ, కావ్యాలూ అంటూ తెలివిడి కోల్పోయిన అర్ధనగ్నతను ప్రదర్శించేది. ఈ ప్రమాదాన్ని శంకించియే భామహుడు –

నా కవిత్వ మధర్మాయ వ్యాధయే దండనాయ వా ।
కుకవిత్వం పునస్సాక్షా న్మృతి మాహుర్మనీషిణః ॥

(కావ్యాలంకార 1/12)

అని హెచ్చరించింది. 'కవిత్వం వ్రాయకపోవటం అధర్మం కాదు. వ్రాయనందు వల్ల రోగాలు రావు. వ్రాయలేదని ఎవరూ శిక్షించరు. అయితే చెడ్డ కవిత్వం వ్రాస్తే మాత్రం అది సాక్షాత్తు మరణమే అని పెద్దలు చెప్పారు' అంటూ భామహుడు తనకు ముందున్నవారూ అలాగే భావించారన్నాడు. అందుకే కొందరు కవిత్వం వ్రాయటం భాషాసేవ అయితే కొందరు వ్రాయక పోవటం భాషాసేవ. వ్రాయకపోవటం భాషాసేవయే అన్నామని ప్రతిభావంతులు వ్రాయటం మానకూడదు. ప్రతిభావంతులా? ప్రతిభామంతులా? అన్న అనుమానం వచ్చి చేతులు కట్టివేసుకోకూడదు. ఏ పుట్టలో ఏ పాము ఉంటుందో ఎవరికీ తెలియదు గదా! కాబట్టి వ్రాయాలి. తమ వ్రాతలతో భాషాసేవ, సమాజసేవ చేయాలి. అయితే వ్రాసే ముందు చదవాలి. తెలిసికోవాలి. అవగాహన తెచ్చుకోవాలి. మన తెలివిడిలో పొరపాటుంటే తెలిసిన వారు చెప్పింది గ్రహించగలగాలి. దిద్దుకోవాలి. అడగడం నామోషీ అయితే స్వయంగానే అధ్యయనం చేయాలి. ఉప్పుడు గుణదోషవిచారణ చేసి దోషాలను పరిహరించి, గుణాలను ఆదరిస్తూ కవితా నిర్మాణానికి ఉపక్రమించాలి.

సంస్కృతాలంకారికులు వివిధ దోషాలను క్రోడీకరించి లక్షణోదాహరణలను చూపించారు. దోష లక్షణం ఏమిటంటే 'గుణం కానిదే దోష'మన్నారు. అంటే ఒక నిర్దిష్టలక్షణాన్ని ఒప్పుకుంటే దానికి భిన్నమైనది దోషమని భావం. అనగా ఒక ప్రాథమిక గుణాన్ని– ఏ ప్రమాణాల చేతనైనా – మనం అంగీకరిస్తే దానికి భిన్నంగా వ్యవహరించటం దోషం. అయితే ప్రాథమిక గుణ విషయంలోనే ఒప్పుదల లేక పోతే అక్కడ దోష ప్రసక్తియే ఉండదు. దేనినీ ప్రాథమికంగా అంగీకరించక పోవటమే ఒక దోషం కాబట్టి.

ఆలంకారికుల నిర్ణయంలో పదదోషాలూ, పదార్థ దోషాలూ, వాక్యదోషాలూ, వాక్యార్థ దోషాలూ అని దోషాలు నాలుగు రకాలు. రసభావదోషాలు ఒక ప్రత్యేకవిభాగం. ఈ అయిదు రకాల దోషాలలో కూడా కొన్ని నియతదోషాలు. అంటే అవి ఎప్పుడైనా తప్పులే. కొన్ని అనియత దోషాలు. అంటే అవి కొన్నివేళల దోషాలు, మరికొన్ని సందర్భాల్లో దోషాలు కాకపోగా ఒక్కొక్కసారి గుణాలూ అవుతాయి. నియత దోషాలు సర్వాత్మనా పరిహరింపదగినవి. అనియత దోషాలు ప్రకరణాదులను బట్టి పరిహరణీయాలైనా కావచ్చు, పరిగ్రహణీయాలైనా కావచ్చు. పదదోషాలతో ప్రారంభించి ఈ దోషాల నన్నింటిని గురించి తెలుసుకొందాం.

(సశేషం)

1

విశిష్ట తెలుగు భాషా వైభవం- ఛందః ప్రాముఖ్యం

- డా. సంగనభట్ల నరసయ్య

ఉపోద్ఘాతం

ఛందో హీనో నశ్లోఽస్తి
నచ్ఛందః శబ్ద వర్జితమ్

అని భరత మహర్షి నిష్కర్ష. ఛందస్సులేని శబ్దం ఉండదు. శబ్ద వర్జితమై ఛందస్సుండదని దీని అర్థం. ప్రతి శబ్దం భాషలో విస్పష్ట ధ్వని (అక్షర) సమ్మేళనమై, విశేషార్థకమై, విచిత్ర లయాత్మకమై ఉంటుందని, ఛందస్సు నిశ్శబ్దంగా, ధ్వనిరహితంగా ఉండక శబ్దవర్జితం కాక, శబ్దాశ్రితమై ఉంటుందని వ్యాఖ్యానించ వచ్చు. వాక్యం లేదా వాక్యఖండం ఛందః పరివేషమే.

లకుమకు తోచెను రాయడు

ప్రకృతికి పురుషుని పోలిక... అంటే ఈ శబ్దాలే లయకు (ఛందానికి) కారణం. ఇవి వర్జించి ఛందముండదు. శబ్ద రహితంగా పై చతురస్రగతి రాదు. రెండు మాత్రల హరి శబ్దం, మూడుమాత్రల గిరిజ శబ్దం, నాలుగుమాత్రుల కమలజ శబ్దం, ఐదు మాత్రల దినకరుడు శబ్దం.. ఇలా ఏ శబ్దమైన లయకు ఆవిష్కారక ఉపకరణంగా అవిష్కృతం అవుతుందేగాని ఛందో హీనంగా శబ్దం ఉండదని భరతముని ఉవాచ.

భాషావిర్భావానికి, భాషాభివృద్ధికి, భాషాసౌకుమార్యానికి, భాషాస్నిగ్ధతకు ఛందస్సు ఇలా సహకరిస్తుంది.

ఛందస్సంటే కేవల త్ర్యక్షరగణ వ్యవస్థ కాదు. గానం, తదాత్మ్యమైన లయ, తాళబద్ధత, పాదనియతి. ఈ 'జ్ఞానం లేక కొందరు భాషలో దానికి గల ప్రాముఖ్యం మరచి, ఛందో వైముఖ్యాన్ని ప్రకటించారు. శ్రీశ్రీ 'ఛందో బందోబస్తులు త్రెంచి అని ఛందస్సర్పపరిష్వంగం, పద్యాల పావుకోళ్లు' అని ఈసడించగా ఆయన తోక పట్టుకొని నడిచినవారు అలాగే వంత పాడారు. పఠాభి "పద్యాల నడుములు విరుగదన్ని" అని ఈసడించాడు. పద్యం రాయడం తెలియని పఠాభి అనడం విడ్డూరం. తన షష్టిపూర్తి సంచికలో క్షమాపణలు చెప్పినా, వీరి వాక్యాలు అనాలోచితాలు, అనాదరణీయాలు, భాషావైభవతేజాలకు చీకటి పులిమాయి.

పద్యం తెలుగు జాతి జీవనాడి. పద్యం వయస్సు 1500 ఏండ్లు. తెలుగు ఛందస్సుల గూర్చి చెప్పిన విష్ణుకుండిన నాలుగో మాధవవర్మ 1600 ఏండ్ల కింద 'జనాశ్రయ ఛందోవిచ్ఛిత్తి' రాసినాడు. రెండువేల సంవత్సరాల క్రితమే హాలుడు తెలుగు ధవళాలు రాసినాడు. ధవళం యక్షగాన ఛందం. కంద పద్యం మాతృమూర్తియైన గాహాఛందం తెలుగు నాట 2 వేల సంవత్సరాల క్రితం 'గాథాసప్తశతి' రూపంలో రచింపబడింది.

తెలుగు ఛందస్సు దేశీయంగా అభివృద్ధి చెందుతూనే, సంస్కృత ఛందస్సులైన మార్గిని కూడా స్వతం చేసికొంది. మార్గివృత్తాలకు సదృశాక్షర నియతి, ద్వితీయాక్షర ప్రాస వంటి కొత్త సొబగులు అద్దింది. రగడల్లో పాదాంత్య ప్రాస నియంత్రించి, పాటకు కొత్త అందాలు ఇచ్చింది. వృత్తాల్లో పదసమాప్తి రూపయతితో లయావైవిధ్యం అందించింది. పాదాంతయతిని సంస్కృత మర్యాదను తిరస్కరించి, పాదోల్లంఘనతో తరువాతి పాదంలోకి దూకి ప్రాసను కాపాడింది. పాటలవంటి బహుపాద వ్యవస్థను సంస్కృత వృత్తాల్లో నిలిపి ఉత్పలమాలికలు, చంపకమాలికల (మాలికావృత్తులు) నల్లింది. దేశీ పద్యాల్లో లయానుగుణ గణవ్యవస్థ, గణానుగుణ పదవ్యవస్థ, పదానుగుణ యతివ్యవస్థను ఏర్పర్చింది. గణానుగుణ యతి విరామం, దానికంటే అందమైన ప్రాసయతి నియమం సొంతం చేసికొంది. తెలుగు సంస్కృత పద్యాలలో సుమారు 150 మూసల (పద్యాలు) సృష్టించుకొని కవి కల్పనామయ, భావనామయ, దైర్ఘ్యానికి దగ్గ ఛందస్సులు సిద్ధం చేసికొంది. ఇన్ని వైవిధ్యాలు సోదర ద్రావిడ భాషల్లోగాని, సంస్కృత, ప్రాకృతాది హింద్వార్య భాషల్లో గాని లేవు. తెలుగు జాతిని వికాసానికి, తెలుగు భాషా వికాసానికి ఒకటిన్నర సహస్రాబ్దుల ఛందోవైభవం అనితర భాషా ప్రయుక్తం, అద్భుతం.

యతి, ప్రాసగల పద్యాలు, యతిగల పద్యాలు, ప్రాసలేని పద్యాలు, ప్రాసయతి గల పద్యాలు, త్ర్యక్షర గణక పద్యాలు, సూర్యేంద్ర చంద్రగణ పద్యాలు, గగభజసనల (చతుర్మాత్రా) గణ పద్యాలు, మాత్రాగణ పద్యాలు, తాళగణ పద్యాలు ఎన్ని వైవిధ్యాలో! ఎన్నెన్ని నడకలో!

భాషాభివృద్ధిలో ఛందస్సు పాత్ర సామాన్యమైందేమి కాదు. ఛందస్సు వల్ల మౌఖిక సంప్రదాయంలో సాహిత్యం నిలిచింది. అవిద్యావంతులైనా స్వచ్ఛమైన, నుడికారశోభితమైన తెలుగును ఉపయోగించేవారు. దీనికి కారణం శతకాలు, యక్షగానాలు, గేయాలు. ఛందశ్శోభితాలు కనుక లయబద్ధాలు, సులభ కంఠస్థాలు, మరపులోనికి జారనివిగా తెలుగువాని జీవితంలో నిలిచాయి.

(సశేషం)

25/08/1915న తెనాలిలో జరిగిన శ్రీ ప్రతాప వేంకటేశ్వరకవి అష్టావధానం యథాతథంగా...

అవధానమంజరి

తెనాలి

(అష్టావధానము)

రాక్షసనం॥ చైత్రశు॥ నవమి గురువారము (25-8-1915)

—ప్రార్థన—

శ్రీ సీతాసతియుఁ సహోదరులు కూర్మిఁ బార్శ్వభాగమ్ములన్
భాసిల్లం బవనాత్మజుండు చరణద్వంద్వమ్ముపై వ్రాలి నీ
కై సాష్టాంగమొనర్చుచుండ కడువేడ్కన్ బట్టభద్రుండవై
ఆ సాకేతము నేలినట్టి రఘురామా! త్వత్కృపన్ జూపుమా!

చం॥ నలువకు రాణివై నతజనంబులకున్ సురభూరుహంబవై
కళలకు నెల్లఁ దల్లివయి కల్మి నెలంతకుఁ గూర్పు ముద్దుకో
డలవయి విశ్వనాథుని ఫణంతికి నెచ్చెలివై చెలంగు నో
పలుకువెలంది! యీసభ నపారకృపన్ విజయమ్మొసంగుమా!

చం॥ కరమనురక్తి నిత్యమును కైతరచించుటఁ జేసి ధారకున్
కొఱంతఘటిల్లకున్న నిది నూతనమౌటను నేఁడు ధారణా
గరిమకు సంశయించెదను గావున నీయవధానమందు త్వ
త్కరుణను జూపుదున్ జయము కల్గునటుల్ ప్రసరించుమంబికా!

ప్రారంభము.

శ్రీరామచంద్రుఁడు

కం॥ జనకుని యాజ్ఞను దలనిడి వనములకుం బోయి మౌనివరుల నసుర్యల్
ఘనముందమున నీవందనా! జనకజముఖ్యమ్ములతోడ సతతము రామా!

ఆంజనేయస్తవము.

మ॥ వనధిన్ దాటి సురారివానమయి సంప్రాప్యమ్మునై పొల్పులం
కను వైదేహియొ పెక్కుబన్నములచే గగ్గోలుచెందంగ రా
మునివృత్తాంతముదెల్పి జానకికి సమ్మోదమ్ముగం గూర్చియుం
డిన వాతాత్మజు నాంజనేయుని సదా డెందమ్మునం గొల్చెదన్.

శంకరస్తుతి.

శా॥ అంగం బెల్లను బూదిపూసి కుహనా వ్యాపారముల్ బూనెదో
శృంగారం బెఱుఁగంగలేని మునిగా! సెబాసు! అట్టైనచో
గంగ న్మౌళిని దాల్చుటేలయని శృంగారంబుగా నార్య ప
ల్కంగా నవ్వెడు శంకరుండు మనకుం గల్యాణముల్ గూర్చుతన్

సర్వీపార్టీని గూర్చి

సీ॥ ఎండకన్నెఱుఁగకే యెసఁగుచుండునరుండు
పంచాగ్నిమధ్యవసించునటుల
అలరులసెజ్జపై నత్తమిల్లునరుండు
గులకఱాలను పండఁగలిగినటుల
అనుకూలవతియైన యాలుకల్గునతండు
కులటచేవెత్తించు కొనినయటుల
మృష్టాన్నకలనచే తుష్టిఁజెందునరుండు
శుష్కోపవాసియై నుక్కినటుల

గీ॥ సౌఖ్యముగనున్న ప్రాణంబు సంకటముల
పాలొనర్చెడి యీసర్వీసు పార్టిలోనఁ
జేరుచుందురు కొందఱు శ్రీమనుచు
"చదువురానట్టివారికి సర్వియనరె."

శ్రీ గిరిరాజు వేంకటరత్నముగారు.

సీ॥ తనవాక్రియించుచో నెనరూని ఫలమీయఁ
గల్గును కల్పవృక్షమ్ము పగిది
హితవితానముఁగాంచి కుతుకమ్ము వహియించి
వారికోర్కెలు నెరవేరఁ జేయు
తలిదండ్రులను మోదజలరాశిలోఁ దేల్చ
భక్తుఁడై వారల పజ్జనిలచు
తనతోడియుద్యోగు లనుదారకావళి
దరిఁబోల్పు కుముదబాంధవుసిరిని

గీ॥ జ్ఞాతులెల్లరు నాత్మసంశయమ్ము నకును
వారినిం గూర్చెనంచును బ్రస్తుతింప
వరలుచుండె శ్రీగిరిరాజవంశమునను
రసికజనవర్తి వేంకటరత్నమూర్తి॥

అవధానాంతమునఁ జెప్పినది.

ఉ॥ చేయఁగలండొ లేఁడొయని చిత్తమునందున సంశయించు వా
రిమొద మేలుమేలనఁగ నీసభయందు జయమ్ముగల్గ నా
పై యనరేని ప్రేముడిని వాగ్గరిమంబు నొసంగినట్టి కా
త్యాయని! యింకతోడుపడుమా! యవధానములందు నిట్టులన్.

నెల్లూరువైశ్యసేవనునకు శ్రీ॥ వేం॥ రత్నముగారు వచ్చినప్పుడు చెప్పినవి.

మ॥ కుడిరొండన్ దనువెల్లదన్ని వదనోత్సేకమ్ము నోవంగ నె
క్కుడు దూరమ్ముగ భారమందు మదిఁగొంకున్ జంకులేకుండ ని
క్కడికిన్ వేంకటరత్న వచ్చితివె! నిక్కంబైన మిత్రుండ వా
క్కడ వీవేయని నెంచెదన్ విహితమార్గంబందు నీనాటికిన్॥

మ॥ ఉదయంబాదిగ నిన్నుఁగాంచుటకునై యుత్సాహముం జెంది యి
య్యుదయంబందున్ నయనోత్సవమ్ముగను నీదౌ రూపుఁగన్గొంటి చె
ప్పుదనో చెప్పఁగలేనొ మేల్ కవిత రంజింపంచెన్ నిముంజూపె మా!
సదయన్ వేంకటరత్న మిత్రుఁడు ప్రశస్తంబైన నెల్లూర్ పురీ!

తటిల్లతలు

ప్ర: "పొగ త్రాగని వాడు దున్నపోతై పుట్టున్" అన్నారు గదా! మీరు పొగతాగుతారా?

స: ఇక్కడ దీనిని జాగ్రత్తగా అర్థంచేసుకోవాలమ్మా ! "పొగ తాగనీ ! వాడు దున్నపోతై పుట్టున్" అని భావం. కాబట్టి నేను పొగ తాగను, దున్నపోతునూ కాను.

ప్ర: శంకరాభరణం సినిమాలో "శంకర గళ నిగళము" అన్నారు. దాని అర్థం ఏమిటండి?

స: 'శంక' అంటే అనుమానం. అనుమానం ఉంటే –'రా', అంటే వచేసెయ్యి. 'నీ' అంటే నీయొక్క గళాన్ని, అంటే మెదను గొలుసేసి పట్టుకుంటానని అర్థం.

ప్ర: భీమసేనుడికి ఆ పేరెందుకు వచ్చిందండీ ?

స: జీవిత భీమా ఎక్కువ చేశాడు కాబట్టి.

ప్ర: ఓటుకు, నోటుకున్న సంబంధాన్ని ఒక పద్యంలో చెప్పండి.

ఓటు కొరకు నీవు నోటిచ్చినావయ్య,
చెల్లలేదు దాన చిల్లులుండె,
ఓటు ముద్రలన్ని ఒత్తేసినానయ్య,
ఓటు చెల్లకుండ ఒళ్ళుమండి.

ప్ర: మీకు దండ లిష్టమా ? దండా లిష్టమా?

స: రెండూ దండగేనండి.

డా. రాళ్ళబండి కవితాప్రసాద్ 'శతవధానకవితాప్రసాదం నుండి

అవధాన సౌరభమ్ - I

-సాంప్రతి సురేంద్రనాథ్

సద్విమలాంతఃకరణల
సద్విద్యుద్ద్యోతమానసర్వార్థద దీ
వృద్విద్యాప్రద శారద
చిద్వీథినినిలిపి కొలుతు చిన్మయసుఖదన్

సారస్వతరసజ్ఞసహృదయులందరికీ వందనమందారములు.. తొలుతగా అవధానసరస్వతికి నమస్సులు..

అవధానము అనగానే మనభావనాక్షేత్రంలో సాక్షాత్కరించే మహాకవిద్వయము..అవధానసరస్వతీస్వరూపులు.. తిరుపతి వేంకటకవులు.. శ్రీదివాకర్ల తిరుపతిశాస్త్రిగారు.. శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు.. వారికి కైమోడ్పు..

అవధానకళా బ్రహ్మలు
దివిజగురుప్రతివిశిష్టధిషణా శ్రీవై
భవులిల తిరుపతి వేంకట
కవులు కవితార్థభవులు కవికులగురువుల్

అలఘుప్రాభవ ధీసమన్వితులు సద్యఃస్ఫూర్తిమద్భాసురో
జ్జ్వల విస్ఫార శతావధానకవితాసామ్రాజ్య పట్టాభిషి
క్తులు సద్భూప సభాంతరాళ వినుతాస్తోకాశుధారా ప్రగ
ల్భులు శ్రీ తిర్పతి వేంకటేశ్వర కవీంద్రుల్, జోత లవ్వారికిన్

అవధానము అంటే.. చిత్తైకాగ్ర్యమ్ అవధానమ్ అని ప్రశస్తి కెక్కిన నిర్వచనము

అమితాఖ్యానక శాఖలం బొలిచి వేదార్థామలచ్ఛాయమై?
సుమహద్వర్గ చతుష్కపుష్పవితతిన్ శోభిల్లి కృష్ణార్జునో?
త్తమ నానాగుణ కీర్తనార్థఫలమై ద్వైపాయనోద్యాన జా?
తమహాభారతపారిజాత మమరున్ ధాత్రీసురప్రార్థ్యమై.

ఇట్టి మహాభారతంబు ననేకవిధ పదార్థ ప్రపంచ సంచితంబు నుపపర్వ మహాపర్వోప శోభితంబు నుపద్వీప మహా ద్వీప సంభృతంబయిన భువనంబజుండు నిర్మించినట్లు కృష్ణద్వైపాయనుండు నిఖిలలోకహితార్థంబు దత్తావధానుండై సంవత్సరత్రయంబు నిర్మించి– నారని వాగనుశాసనులు నన్నయమహర్షి ప్రశంస.. (ఆదిపర్వము:1-66,67)..ఆదికవి ప్రశంసలో "దత్తావధానుండై" అన్నది గమనార్హము.. చిత్రమేమనగా..

అచతుర్వదనో బ్రహ్మా ద్విబాహురపరో హరిః
అఫాలలోచనశ్శమ్భుః భగవాన్ బాదరాయణః

అని వినుతికెక్కి, త్రిమూర్తిస్వరూపులైన వ్యాసభగవానులవారు సంవత్సరత్రయంబు – నిర్మించిన మహాభారతము.. తెలుగులో త్రిమూర్తులైన ముగ్గురు కవీశ్వరులచేత శతసంవత్సరత్రయంబు– నిర్మింపబడింది..

ఇంతకు అవధానమనగా ఏకాగ్రత.. అవధానము – వేదములలో ప్రసిద్ధి..అవధాని – వేద విద్వాంసుడు.. వేదావధానులు, అవధాని పదనామధేయము కలవారు.. అందరికీ తెలిసిన విషయమే.. ఆ ఏకాగ్రతప్రధానమైన మనోధర్మమే క్రమంగా సాహిత్యంలో అష్టావధానము, శతావధానముగ రూపొందింది.

నేడు మనకు తెలిసిన అవధానములో, నిషేధాక్షరి, సమస్య, దత్తపది, వ్యస్తాక్షరి/న్యస్తాక్షరి, వర్ణన,ఆశువు,–ఇవి తప్పనిసరిగా ఉండే కవిత్వప్రధానాంశములు. ఇవి కాక సభారంజనమునకై పురాణపఠనము, అప్రస్తుతప్రశంస, ఘంటాగణనము, పుష్ప గణనము, ఇత్యాది..

తెలుగు భాషలో ఈ చతుర్విధకవిత్వప్రక్రియలు ఎప్పటినుంచీ ఉన్నాయి.. అంటే.. తెలుగు సాహిత్యమవతరించిననాటినుండే ఉన్నాయి అనుకోవాలి..ప్రాచీనకవులందరూ చతుర్విధ కవిత్వ విద్యాపారంగతులే..

ఆంధ్రసారస్వతస్రోతస్విని అవతరణ భగీరథులు.. నన్నయ మహర్షి ఆంధ్రమహాభారతావతారికలో:

"అఖిల జలధి వేలావలయిత వసుమతీ వనితావిభూషణంబైన వేంగీ దేశంబునకు నాయకరత్నంబునుంబోని రాజ మహేంద్ర పురంబునందు మహేంద్ర మహిమతోఁ బరమానందంబున ననవరతమహామహీ రాజ్యసుఖంబులను భవించుచు సకలభువన లక్ష్మీవిలాస నివాసంబయిన రమ్యహర్మ్యతలంబున మంత్రి పురోహిత సేనాపతి దండనాయ క దౌవారిక మహాప్రధాన సామంతవిలాసినీ పరివృతుఁడయి యపారశబ్ద శాస్త్రపారగులైన వైయాకరణులును భారత రామాయణాద్యనేక పురాణప్రవీణులైన పౌరాణికులును మృదుమధురరస భావభాసుర నవార్థవచన రచనా విశారదులయిన మహాకవులును వివిధ తర్కవిగాహిత సమస్తశాస్త్ర సాగరగరీయః ప్రతిభులైన తార్కికులును నాదిగాఁ గలుగు విద్వజ్జనంబులు పరివేష్టించి కొలుచుచుండ విద్యావిలాస గోష్ఠీసుఖోపవిష్టుండయి యిష్టకథావినోదంబుల నుండి యొక్కనాఁడు." (ఆదిపర్వము:1-8)

ఆదికవి పేర్కొన్న "మృదు మధుర రసభావభాసుర నవార్థ వచన రచనా వైశారద్యమే" తర్వాతి కాలంలో ఆశు, చిత్ర, మధుర, విస్తర చతుర్విధకవితారీతులుగా ప్రసిద్ధమై.. క్రమేణ పరిణతిజెంది విస్తరించి, చిత్రకవిత్వాంతర్భాగములుగా సమస్యాపూరణలు, వర్ణనలు, వ్యస్తాక్షరి, న్యస్తాక్షరి, దత్తపదులు చేరి.. అష్టావధానావతారము ఆవిర్భవించింది.. **(సశేషం)**

ఖండశర్కర

నిర్వహణ: శతావధాని ఎం.వి. పట్వర్ధన్
అష్టావధాని చేపూరి శ్రీరామ్

ఈనెల అంశం: దీపావళి - ఆనంద రూపావళి

క్రొవ్విడి వెంకట రాజారావు, హైదరాబాదు

ఉ. జాతిమతమ్మువర్గకుల జాడ్యములన్నియు విస్మరించుచున్
ప్రీతిగ నైకమత్యమున ప్రేమయెగూడగ నందరెల్లెడన్
జ్యోతులవెల్గజేసి కడుసోయగమౌనటు దీపపర్వమున్
భీతియెలేక సల్పెదరు విస్తృతిజెందిన దోహలమ్ముతోన్.

మ. బవరంబందున దైత్యుడానరకునిన్ పాలార్చి లోకాలకున్
చవినందించిన కృష్ణసత్యలను సంశ్లాఘించి యొప్పైననీ
భువిలో కాంతులునింపు దీపచయముల్ పూన్పించి పౌరాళియున్
వివశత్వంబునమున్గి యీ దినము సంప్రీతిన్ ప్రవర్తిల్లెడిన్.

మ. భువిలో జాగృతమల్లి దివ్యపథముల్ పొల్పొందగావించియు
న్నవకమ్మొప్పు నవీనచేతనమతుల్ నాటించి యైక్యమ్ముగన్
జవసత్వమ్ములొసంగి యంతరములన్ జక్కొల్పి సంప్రీతితో
నవనీతమ్మగు భావముల్ నిలుపు నానందంపు దీపావళుల్.

శా. శ్రీరాముండు సతీసమేతుడగుచున్ క్షేమమ్ముగా జేరగన్
నోరారంగ నయోధ్యపౌరగణముల్ నూరారునౌ స్తోత్రముల్
తీరున్ బల్కి యపార హర్షదముతో దీపావళిన్ సల్పి తా
మారాధించియు భక్తిరక్తి రసముల్ మ్రార్మోగజేసెన్ గదా!

శా. ఆనందంబునుగూర్చు పర్వమిదియున్నాశ్వీజమాసమ్ములో
తానేతెంచమవాస్యనాటి దినమున్ ధామమ్ములేజేర్చగ
న్నానారీతుల దీపగుచ్ఛవితతుల్ నల్వైపులేపారుచున్
పోనిచ్చున్ తమమున్ సమస్తదిశలన్ మొత్తమ్ము తీరొందుచున్.

మంకు శ్రీను, కొప్పర్రు

ఉ. భూవలయంబునన్ వెలుగు పున్నమియై పెనుపొందునట్టి దీ
పావళికేది సాటి జనపాళికి రవ్వల దివ్వెలందు మో
దావళి తెచ్చు పర్వమిదె ఆసుర వృత్తినడంచివైచి రా
కావిధుకాంతి సంకలిత కాండము నిల్పును సత్యమిద్దియే

ఉ. మానవతీలలామలను మన్నన చేసిన శ్రేయమబ్బెడున్
మానవతీలలామనవమానము చేసిన హాని కల్గెడిన్
దానవజాతికీనిజము తట్టదు పట్టదు మన్మథాస్త్ర బా
ధానికరంబుచే నరక దైత్యుడు తా చెరబట్టెనింతులన్

మ. మరివిల్లంబులు దాల్చి సత్య హరితో మారాడకేతెంచె నా
నరకున్ జంపగ రౌద్రవీక్షలటుపై నర్తింపనీచక్కి సుం
దరహాసంబులు సందడింపగ సమిత్పాండిత్య సంపన్నయై
నరకున్ కూల్చిబిరాన ముక్తినిడెనా నారీజనశ్రేణికిన్

ఉ. చీకటివోయె శాంతివిలసిల్లె జగజ్జన చిత్తవీధులన్
శ్రీకరమైన దీపమొక జీవన సూత్రముగా చెలంగె ని
ర్వ్యాకులవృత్తినెల్లరును రంజిలుచుండిరి నాటినుండియున్
వేకువ సత్యమైనిలిచి వేదన బాపును జీవకోటికిన్

చ. కరమనురక్తి గొల్పుగద కాకర పువ్వు మతాబులాపయిన్
స్థిరమతికద్దమై నిలుచు సీమటపాసులు క్రోధభావనా
స్ఫురణము చాటు జువ్వలవెచూపును పూరుష వేగ తత్త్వమున్
తరమె నుతింప దీపరమ నవ్య విభాకర పాండితీప్రభన్

డా.రఘుపతి శాస్త్రుల, హైదరాబాదు

శా. దీపమ్ముల్ జన జీవనమ్ముల సుదీప్తిన్ వెల్గ జేయున్నదా
తాపమ్ముల్ మనమందు పోవ గనుచున్ ధైర్యమ్మొసంగున్ తమ
మ్మేపారన్ నశియింప జేయు సుమతిన్ హృద్యమ్మునౌ రీతులన్
ప్రాపున్ సంపద లొందు పర్వమున సంభావించినన్ సన్మతిన్

ఉ. జీవనమంధకారమగు చెయ్దము లేవియు లేకయున్న స
ద్భావ తరంగముల్ సుగతి వర్ధిల జేసెడు నట్టి యోచనల్
ప్రోవగ జేయు వాస్తవపు పోడిమి నెంచుచు ముందు కేగినన్
కావున విజ్ఞులందరును కార్య నిమగ్నులు కావలెన్ సదా

ఉ. దీపము మానవాళి కొక దీప్తి నొసంగెడు చిహ్నమౌ కనన్
పాపపుకార్యముల్ జగతి వంచన గూర్చుచునుండు, ధ్వాంతమున్
ప్రాపును నొంద నీయదు, వివర్ధన రీతుల వెల్గు రేఖలే
ఓపుచు మేలు గూర్చును సయోధ్య యదే యగు జీవన మ్మునన్

ఉ. గమ్యము నెంచ నట్టి నరకాసుర దుష్టుని కృష్ణుడెంచి తా
రమ్యమునైనరీతిని విలంబన సేయక సత్య గూడి యే
సౌమ్యపు దారి లేక తన చక్రముతో కడ తేర్చె గాదె యే
గమ్యము లేని పాలసుల కర్మలె చావుకు మూలమౌ కనన్

శా. ఆనందమ్ము కనంగనౌ జగమునందౌదార్యమున్ చూపుచున్
వాణిన్ నమ్మి హితమ్ము సేయగల సంపత్తున్ కనంగల్గుచున్
రాణింపన్ వలె దుష్టయోచనలు దూరమ్మందునన్ పెట్టి యీ
క్షోణిన్ జీవనమందగల్గ నదియే కూర్మిన్ సదా గూర్చెడున్

పెనుకొండ రామబ్రహ్మం, బెంగుళూరు

చం. నరకుని బాధ సైఁచకను నమ్మిరి యష్టమ గర్భమందునన్
నరకుని సోదరీమణికి నందుఁడు సజ్జన రక్షఁ గాంచఁగన్
నరకునిఁ ద్రుంచఁ బుట్టునని నాకము ధాత్రికిఁ దెచ్చునంచు నా
నరహరి పుట్టి చెండఁగను నందము నొందిరి పర్వ మేర్పడెన్

మ. వనవాసమ్మును వీడి రాఘవుఁడు సద్భాగ్యప్రదానాబ్ధియై
వినయమ్మొప్పఁగ రాజధాని చన సంప్రీతిన్ బ్రజావాహినుల్
ఘన సంతుష్ట మయూఖముల్ విరియ సౌఖ్యంబొందుచున్ బర్వమున్
దనరన్ నిల్పిరి దీప పంక్తులను సంధానించెడిన్ రూపునన్

ఇంద్రవజ్ర: దీపంపు శ్రేణుల్ ఘన దీప్తిఁ గాంచన్
దాపాడి భాసిల్లఁగ ధాత్రి సౌఖ్యం
బేపారు రూపంబున నేఁగుదెంచన్
దీపావళీ పర్వపు తేజమొప్పున్
దీపావళి కార్యక్రమము

మ. సిరికిన్ బూజలు సేయ సంపదల సుశ్రేయంబు ప్రాప్తించెడున్
హరికిన్ బూజలు సేయ భవ్యమగు సౌహార్దమ్ము వర్ధిల్లెడున్
బరఁగన్ గేహము వీధి వీధులును దీపాలంకృతంబై యటుల్
వరమై సంతస మాధురీ గరిమ సౌభాగ్యమ్ము దీపించెడున్

ఉ. పొందుగఁ బద్ధతిన్ గనుచుఁ బూజలు నోములు ప్రార్థనాదులున్
విందును జేసి పిల్లలటు ప్రీతిగఁ గాల్చఁగ బాణసంచునున్
జిందెడు దీప కాంతులను జీకటు లంతము గాఁగ యామినిన్
డెందము మోద వాహినుల తీవినిఁ గాంచదె పర్వమందునన్

చింతారామకృష్ణారావు, హైదరాబాదు

శా. శ్రీమన్మంగళ దీప కాంతుల మహచ్ఛ్రేయోభిరామ ప్రభా
భూమింగాంచిన దేవతా నికరముప్పొంగన్ శుభాధిక్యతన్
ధీమంతుల్ పచరించు పండుగయె యీ దీపావళీ యుత్సవం
బేమాసుందర ధాత్రిశోభ, వెలిగెన్ హృద్యంపు స్వర్ణప్రభన్.

చం. వలిపపు నూత్నవస్త్రముల భాసిలుచున్ మలుసంధ్యవేళలో
కుల మత భేదముల్ మఱచి కుంభినిపై నరజాతి యంతయున్
సులలితభావనాప్రభల సుందర బంధుర దీపరత్నముల్
కొలువులు తీరినట్టులుగ కూర్తురు శోభిలు దీప మాలికల్.

చం. నరకుని బాధ వీడిన జనంబు శమంబు నభంబు నంటగా
సరగున తార జువ్వలను చక్కగ తారలఁ జేర వేయుచున్,
పొరలెడియగ్నినాన్ వెలుగు భూతలచక్రములన్ విదుల్చుచున్,
పలుపలు వర్ణకాంతులను భాసిలు మందులఁ గాల్తు రిత్తరిన్.

ఉ. నూతన వస్త్రధారణల, నోటికి తీయని పిండివంటలన్,
ఖ్యాతిగ నాత్మబంధు లనుయాయులు నొక్కెడ చేరి పండువున్
బ్రీతిని చేసికొందు రిది వెల్గులపండుగ, మిన్న యన్నిటన్,
శ్రీ తిలకంబు లద్దిన సుచిత్రము ధాత్రి యనంగ నొప్పునే.

శా. ప్రాతస్సంధ్యను వెల్గు తేజ మెదలో వర్ధిల్లు సుజ్ఞాన సం
కేతం, బీ మలుసంధ్య దీపతతి సంకేతంబు సంపత్తికిన్,
యాతాయాత దురంత దుఃఖముల నాయాసంబు వీడన్ జనుల్
ఖ్యాతిన్ జేయుదు రిట్టి పండుగను సత్ కాంక్షన్ సుభద్రంబు కాన్.

డా.రామడుగు వేంకటేశ్వర శర్మ, హైదరాబాద్

ఉ. కాకరపువ్వు వత్తులవి- క్రాలెడు కాంతుల పాలవన్నె- లీ
లాకరమౌ నవమ్ము శివరంజని రా! బులిపాప హాసరే
ఖాకరగానరాగ సుమకాంత సరమ్మనుభూతినిచ్చు మేల్
రాకర! యాంత్రికంపు మతి ఊఁగర! వీడుమటంచు పల్కెరా!

మ. నవ లావణ్య విలాస లాస్యమయ చిన్నారీప్రభన్ నేనె- అ
ర్ణవ గంభీరను, భవ్య గంధను, క్షమారమ్యన్, సమాదర్శనో
త్సవనే- అభ్యుదయాత్మశోభిత సమాజప్రాభవాధిక్య వి
ప్లవనమ్మా! అని పల్కెనోయన- మతాబా- కాంతులన్ బంచెరా!”

శా. విచ్చుంగత్తులఁ దాల్చు వీరుల వలెన్ వెల్గొందు వ్యూహాన బల్
హెచ్చైనట్టి సుభద్రసూతి వలె నువ్వెత్తౌచు నుత్సాహులై
తచ్చాడన్ వలె గా! కిశోర మనసై ధాటిల్లు వారంచనన్
మచ్చున్ లేకయె చిచ్చుబుడ్ల గమనమ్మోరా! విరాజిల్లెరా!

ఉ. సీమటపాసు,లౌ,ట్లవిగో! చెన్నుగఁ గష్టసుఖానుభూతి సు
స్థేమముఁ జాటఁ బ్రేలె గద! శీఘ్రమబీ తామరపాకు నీరమౌ
రా! మన తెల్గు వానిది వయస్సది ముప్పది-నల్బదేండ్ల నా
డే మనువేళలంచనెడు హేలలె ధాములు ధాములాయెడున్!

శా. చాలుల్ గాఁ బ్రమిదల్ వెలింగెడు ప్రశంసారీతి సింహావలో
కాలై- జ్ఞానమయైక వార్ధక పతాకారూపకాలౌచుబీ లీ
లాలోలాత్మ శుభైహికాఢ్య పరమార్థప్రాజ్యసేతుప్రభా
వాళీ! కావుమ! ఎల్లరన్ నతులివే! ఆనంద(రూ)దీపావళీ!!!

తదుపరి అంశం

మహిత మార్గశీర్షం

పై అంశానికి 5పద్యములను 9441039146
ఫోన్ నంబరుకు వాట్సప్ ద్వారా పంపగలరు
ఖండికలు పంపవలసిన ఆఖరు తేది
15 అక్టోబరు 2025

సంస్కృతం సంస్కృతి

నారుమంచి వేంకట అనంతకృష్ణ శర్మ

అవధానము తెలుగువారి స్వంతమని, అది వారికే ప్రత్యేకమైన కళ అని లోకప్రసిద్ధము. అయితే ఇతర భాషలలోకూడా కనిపించినా, తెలుగున విస్తరించినంత ఇతర భాషలలో లేకపోవడం గమనించవచ్చు. అవధానం అన్నది ప్రక్రియ, అందు నిష్ణాతులు అవధానులు. ఇది పూర్వకాలమున వేదపండితులను సంబోధించు పదముగా ఉండేది. అయితే ఆ ధారణాదులు ఈనాటి అవధాన ప్రక్రియలో కూడ సమానమౌట వలనో మరే కారణముననో ఈ ప్రక్రియకు కూడా అవధానకళగా పేరువచ్చినది అని పెద్దలంటారు.

కొంచెం ఆలోచిస్తే తెలుగులోనే యీ ప్రత్యేకతకి కారణము ఛందోనియమాలు, భాషలోని పదములు పకృతిపత్యయములతో నిర్మితములు కావడం అని చెప్పవచ్చు. సంస్కృతములో ప్రతి పాదము చివర యతి అన్నది ఛందోనియమము. సంస్కృతములో యతి అనగా పదము విరుగుట మాత్రమే. అందుకే దీర్ఘసమాసాలకు సంస్కృతములో నిర్మాణము గద్యములో కుదురుతుంది కానీ పద్యములో కుదరదు. తెలుగులో ఆ నియమము లేకపోవుట వలన తెలుగు పద్యమునకు సమాససౌష్టవము వలన సొగసు, గాంభీర్యము చేకూరినాయి. యతిప్రాస నియమాలు తప్ప మిగిలిన ఛందోనియమాలు తెలుగు సంస్కృతాలకు సమానము. ఇక భాషలోని పదములు గమనించినట్లైతే, సంస్కృతములోను తెలుగులోను కూడా ప్రయోగించిన ప్రతి పదము కూడా ప్రకృతి ప్రత్యయము అని రెండు అంశముల సమ్మేళనము. ప్రకృతిని ప్రాతిపదిక అని కూడా అంటారు. ఉదాహరణకు రామ అన్న ప్రకృతికి సుప్రత్యయము చేర్చి కొన్ని వ్యాకరణనియమాలను అనుసరించి రామః అన్న సంస్కృతపదము ఏర్పడితే, అదే రామ అన్న ప్రకృతికి డు అన్న తెలుగు ప్రత్యయము కలిసి రాముడు అన్న పదము ఏర్పడినది. రామః, లక్ష్మణః, భరతః శత్రుఘ్నః కలిపి సమాసం చేసినప్పుడు 'రామలక్ష్మణభరతశత్రు' ఘ్నాః అన్నది సంస్కృతమైతే 'రామలక్ష్మణభరతశత్రు'ఘ్నులు అని తెలుగుసమాసం. గమనించినట్లైతే సంస్కృత ప్రకృతులు యథాతథముగా తీసుకుని చివరి వర్ణమునకు మాత్రమే తెలుగుప్రత్యయము కలిసినది. ఇలా నిర్మించిన పదములను తత్సమపదములు అంటారు. ఇవే తెలుగుభాషలో గరిష్టభాగము ప్రయోగములో ఉన్నవి. ఇతరములు తద్భవములు, దేశ్యములు అన్యదేశ్యములు. వాటి పరిశీలన ప్రస్తుతానికి అప్రస్తుతం.

ఇక భాషాపరముగా సంస్కృతము తెలుగుకి నష్టపరుస్తున్నది, సంస్కృతము అక్కరలేదు వంటి మాటలు కేవలం రాజకీయ ప్రయోజనాలకో మరే ఇతర కారణాలకో కానీ భాషాపరముగా తెలుగు సంస్కృతాలకు విడదీయరాని బంధము. వర్ధిష్ణువులైన అవ ధానులు ఇది గుర్తించాలి. పూర్వావధానుల పూరణలు గమనించినట్లైతే సంస్కృతభాషావినిమయం ఎంత విశేషముగా ఉన్నదో తెలుస్తుంది. కనుక అవధానులకు సంస్కృత పరిజ్ఞానము అత్యావశ్యకమైయున్నది అన్నది ఒప్పుకుతీరవలసిన అంశం. పైన చెప్పుకున్న రెండు అంశాలు కాకుండా మరొకటి అవధానికి భావుకత కూడా ముఖ్యమైనది. దీనికి కూడా సంస్కృత జ్ఞానము విశేష సహకారి. అది యెట్లన్నది తదుపరి భాగములో చర్చించుకుందాం. ప్రస్తుతానికి స్వస్తి. **(సశేషం)**



కాశీలో 'దర్శనమ్' ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక ఆధ్వర్యంలో 'అవధానసప్తకం'లో జరిగిన డా. కడిమిళ్ల వరప్రసాద్ గారి అష్టావధానం

Avadhana Puskarini
23 September 2025

అవధాన విద్యా విజయతే తరామ్

Published by
Avadhana Vidya Vikasa Parishat
Sri Rama Sadanam, 29-1499/6/1, Road No.1
West Kakatiya Nagar, Neredmet, Secunderabad - 500056
Ph: 9441039146